తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ

భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాదాద్రి భువనగిరి

గురువారం 14 నవంబర్ 2024 | పేజీలు : 08

Follow :



# అధ్వాన్నంగా

## తుంగతుర్తి గురుకుల పాఠశాల..







**ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక... గాడి తప్పిన వైనం**

**పాటించని మెనూ.. నాసిరకం భోజనం..**

**ఇదేమిటని ప్రశ్నిస్తే.. కొడుతున్న ఇన్చార్జ్ ప్రిన్సిపాల్..**

**ప్రిన్సిపాల్ పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు..**

**పాఠశాలలు సందర్శించిన జిల్లా విద్యాశాఖ అధికారి..**

తుంగతుర్తి నవంబర్ 13 (జనం సాక్షి)
అది పేరుకే గురుకులం.. నిత్యం సమస్యల మధ్య విద్యార్థులు తమ చదువును కొనసాగిస్తున్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ రెసిడెన్షియల్ బాలుర గురుకుల పాఠశాలకు పూర్తిస్థాయిలో ప్రిన్సిపాల్ లేకపోవడంతో ఇంచార్జి ప్రిన్సిపాల్ పర్యవేక్షణలో పాఠశాల నడుస్తుంది. ఉన్నతాధికారుల సరైన పర్యవేక్షణ లేకపోవడంతో గురుకుల పాఠశాల గాడి తప్పింది. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాల్సిన అధికారి నాసిరకం భోజనం పెడుతుండడంతో విద్యార్థులు తమ సమస్యలను ఇటీవల వచ్చిన విచారణ అధికారుల ముందు బోరున విలపించారు. అంతేకాక ఇంచార్జ్ ప్రిన్సిపాల్ తమను అకారణంగా దూషిస్తూ కొడుతున్నాడని విద్యార్థులు తల్లిదండ్రులకు తెలుపగా వారి ఫిర్యాదుతో సొసైటీ అధికారులు విచారణ నిమిత్తం వచ్చారు. దీంతో తాము నిత్యం పురుగులతో పాటు రాళ్లతో కూడిన అన్నాన్ని వడ్డిస్తున్నారని తాము భోజనం తినలేక పోతున్నామని విచారణ అధికారి ముందు ఆవేదన వ్యక్తం చేశారు ముఖ్యంగా పాఠశాలలో అల్పాహారం కూడా పెట్టడం లేదని తెలిపారు. ఇటీవల ఇద్దరు విద్యార్థులపై ఇన్చార్జి ప్రిన్సిపల్ ఆ కారణంగా కొట్టారు దీంతో సంబంధిత విద్యార్థి తల్లిదండ్రులు సదరు ఇంచార్జ్ ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ లిఖితపూర్వకంగా స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

**జిల్లా విద్యాశాఖ అధికారి విచారణ......**

పాఠశాలలో జరుగుతున్న విషయాలను విచారణ చేయడం కోసం బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ తో పాటు సొసైటీ అధికారులు కూడా పాఠశాలలో తనిఖీలు చేసి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేసి అసలు పాఠశాలలో ఏమి జరుగుతున్నది ఎందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు మెనూ పాటిస్తున్నారా? ఎందుకు విద్యార్థుల తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్లో ఇన్చార్జి ప్రిన్సిపాల్ పై ఫిర్యాదు చేశారు అనే విషయాలను ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటశాలను సందర్శించి అక్కడ తయారు చేసిన భోజనాన్ని పరిశీలించారు ఈ మేరకు వంట సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు ఆహారంలో పురుగులు ఎందుకు వస్తున్నాయని మీరు శుభ్రం చేయడం లేదా అని వివరాలు అడిగారు. సొసైటీ ఏజెన్సీ వారే తమకు సరుకులు సరఫరా చేస్తున్నారని అవి అన్ని పురుగులు పట్టి నాసిరకంగా ఉన్నాయని డిఇఓ దృష్టికి తీసుకువచ్చారు. హాస్టల్ వార్డెన్ కూడా నిర్లక్ష్యం తోనే ఈ సంఘటనలు పునరావృతం అవుతున్నాయని తెలిపారు. ఈ మేరకు డీఈవో మాట్లాడుతూ పాఠశాలలో జరిగిన వాటిపై సంబంధిత వార్డెన్ తోపాటు ఇన్చార్జి ప్రిన్సిపాల్ ను సంజాయిషీ కోరినట్లు తెలిపారు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి నివేదికను సమర్పించనున్నట్లు తెలిపారు ఈ సమావేశంలో మండల విద్యాశాఖ అధికారి బోయిన లింగయ్య. తాసిల్దార్ దయానందం. రామన్నపేట గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజా తో పాటు పాఠశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ సతీష్ తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

# టీజీపీఎస్సీ గ్రూప్ -3 పరీక్షలకు పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

## జిల్లా కలెక్టర్ హనుమంత రావు



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో నవంబర్ 13 (జనం సాక్షి):**
టీజీపీఎస్సీ గ్రూప్ -3 పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ అధికారులకు సూచించారు.బుధవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో టిజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్షల నిర్వహణపై రీజినల్ కోఆర్డినేటర్స్,స్ట్రాంగ్ రూమ్, డిపార్ట్మెంట్ ఆఫీసర్ జాయింట్ కస్టోడియన్స్, పోలీస్ నోడల్ ఆఫీసర్స్, చీఫ్ సూపరింటెండెంట్స్, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, జాయింట్ రూట్ ఆఫీసర్స్ తో నిర్వహించిన ట్రైనింగ్ కమ్ కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. బయోమెట్రిక్ విధానంపై అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. నూరు శాతం బయోమెట్రిక్ అటెండెన్స్ ను తప్పని సరిగా తీసుకోవాలని ఆదేశించారు.యాదాద్రి భువనగిరి జిల్లాలో 15 కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని , 6,043 మంది అభ్యర్థులు గ్రూప్3 పరీక్షకు హాజరుఅవుతారని, పురుషులు 3240,స్త్రీలు 2803 మంది ఈ పరీక్షకు హాజరు అవుతారన్నారు. ఇందులో చీఫ్ సూపర్డెంట్( 15), బయోమెట్రిక్ అధికారులు (46) , అబ్జర్వర్లు (17) , జయింట్ రూట్ అధికారులు (3),ఫ్లయింగ్ స్క్వాడ్స్ (5) మంది, డిపార్ట్మెంట్ అధికారులు( 15) , ఐడెంటిఫికేషన్ అధికారులు (65) , ఇన్విజిలేటర్స్ (253) మంది అధికారులను నియమించినట్లు తెలిపారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ తేది 17.11.2024 నఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం12.30గంటల వరకు పేపర్1(జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్) పరీక్ష ( పరీక్షా కేంద్రం గేట్లు ఉదయం 9.30 గంటలకు మూసివేస్తారు), సాయంత్రం 3.00 గంటల నుండి 5.30 గంటల వరకు పేపర్ -2 హిస్టరీ, పోలిటి అండ్ సొసైటీ పరీక్ష ( పరీక్ష కేంద్రం గేట్లు మధ్యాహ్నం 2.30గంటలకు మూసివేస్తారు) ఉంటుందని,తేది18.11.2024న ఉదయం10.00 నుండి మధ్యాహ్నం 12.30 గంటల పేపర్-3 ఎకానమీ అండ్ డెవలప్మెంట్ పరీక్ష( పరీక్షా కేంద్రం గేట్లుఉదయం 9.30 గంటలకు మూసివేస్తారు) ఉంటుందని వారు తెలిపారు. టిజిపిఎస్సి గ్రూప్ -3 పరీక్షలు సజవుగా,ప్రశాంతంగా జరిగేలా పగడ్బందీగా చర్యలు చేపట్టాలని సూచించారు.అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 8:30 గంటల వరకు సాయంత్రం పరీక్ష కోసం 1.30 గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. నిర్దేశించిన సమయం తర్వాత అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించడం జరగదు అని తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఉన్న జిరాక్స్ సెంటర్లను పరీక్ష జరిగే సమయంలో మూసివేయాలన్నారు.పోలీసు బందోబస్తు ఏర్పాటు చెయ్యాలని తెలిపారు. అభ్యర్థులు టీజీపీఎస్సీ సూచనలు పాటించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలన్నారు. పరీక్ష జరిగేటప్పుడు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయాలని, పరీక్ష ఎంట్రెన్స్ గేట్, పరీక్ష కేంద్రాలలో టేబుల్, కుర్చీలు ఏర్పాటు చేయాలన్నారు. సానిటైజ్ చేయాలని, పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్,అంబులెన్సు కూడా అందుబాటు లో ఉంచాలన్నారు.ఏఎన్ఎం, మందులను అందుబాటులో ఉంచాలన్నారు. శిశు సంక్షేమ శాఖ వారు సెంటర్ లో ఒక్క అంగన్వాడీ టీచర్ ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ట్రాఫిక్ ఎ.సి.పి ప్రభాకర్ రెడ్డి, యాదగిరిగుట్ట ఏసిపి సైదులు జాయింట్ కస్టోడియన్, చీఫ్ సూపర్డెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ పాల్గొన్నారు.



# మౌలిక వసతులపై ప్రణాళిక రూపొందించాలి

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నల్లగొండ బ్యూరో,నవంబర్13,(జనం సాక్షి)
నల్గొండ మున్సిపాలిటీలో పూర్తిస్థాయిలో కావాల్సిన మౌలిక వసతులపై ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు.బుధవారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మున్సిపాలిటీ పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్గొండ మున్సిపాలిటీలో నూతన డంపింగ్ యార్డ్ నిర్మాణానికి స్థలాన్ని చూడాలని,స్లాటర్ హౌస్ నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించాలని,ఎక్కడా ఓపెన్ డ్రైనేజీ లేకుండా చూడాలని, పట్టణం చుట్టూ మినీ డంపింగ్ యార్డ్ లు ఏర్పాటు చేయాలని అలాగే నల్గొండ మున్సిపాలిటీలో పారిశుధ్యంలో భాగంగా తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే కార్యక్రమాన్ని కొనసాగించాలని అన్నారు.ప్రస్తుతం ఉన్న కలెక్టరేట్ కార్యాలయంలో 30 కోట్ల రూపాయల వ్యయంతో నూతన బ్లాక్ ను నిర్మించేందుకు ఇదివరకే మంజూరు చేయడం జరిగిందని,సాధ్యమైనంత త్వరగా టెండర్లను పిలిచి 6 నెలల్లో ఈ బ్లాక్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.డైట్ కళాశాల

మిగతా 11లో..



## రవీనాకరుణాకర్ రెడ్డి దంపతుల ఔదార్యం

### నవ వధువుకు రూ.6116కల్యాణలక్ష్మి కనుక

వేములపల్లి, నవంబర్13(జనంసాక్షి):
వేములపల్లి మండల ప్రజా పరిషత్ మాజీ అధ్యక్షురాలు నామిరెడ్డి రవీనా కరుణాకర్ రెడ్డి ఔదార్యంతో వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామా నికిచెందిననవవధువులకు గ్రామ కల్యాణలక్ష్మి కానుకగా రూ. 6116 తోపాటు పట్టు చీరను అందజేస్తున్నారు. గ్రామ కళ్యాణ లక్ష్మి కానుక పంపిణిలో భాగంగా మంగళవారం రాత్రి మొల్కపట్నం గ్రామానికి జేరిపోతుల.రాణి-యాదగిరి దంపతుల కుమార్తెజెర్రిపోతుల మౌనిక వివాహ వేడుకలకు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి -రవీనా దంపతులు హాజరై నవ వధువుకు గ్రామకళ్యాణలక్ష్మి కానుకగా రూ.6116 నగదు, పట్టుచీరను బహుకరించడంజరిగింది.మాజీ ఎంపిపినామిరెడ్డి రవీనా- కరుణాకర్ రెడ్డి దంపతుల ఔదర్యాన్ని గ్రామస్తులు, బందు మిత్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పల్లె శంకర్, పందుల. రమణయ్య, పందుల.మహేష్,నాగరాజ,వెంకటేష్, తిరుమలేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 29 న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయండి

### సీపీఎం జిల్లా కమిటీ సభ్యుల దండ వెంకటరెడ్డి



ఆత్మకూర్ ఎస్ నవంబర్13(జనంసాక్షి):
ఈ నెల 29 న సిపిఎం పార్టీ జిల్లా తృతీయ మహాసభల సందర్భంగా జరగబోయే బహిరంగ సభ ను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దండ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆత్మకూరు ఎస్ మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన దండా వెంకటరెడ్డి మాట్లాడుతూ నవంబర్ 29 న ఆత్మకూరులో జరిగే సిపిఎం తృతీయ మహాసభను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో సీపీఎం మండల కార్యదర్శి ఆవిరే అప్పయ్య, మండల కమిటీ సభ్యులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, సోమిరెడ్డి దామోదర్ రెడ్డి, సానబోయిన ఉపేందర్, నూకల గిరి ప్రసాద్ రెడ్డి ,తండా చంద్రయ్య, యాతాకుల మల్లయ్య, గంపల ఎల్లయ్య ,బెల్లంకొండ చక్రయ్య, ఎరుకల నాగరాజు ,నవీన్ ,రవి, మహేష్ మాలా విజయ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర సర్వేపై రివ్యూ నిర్వహించిన ఆర్డిఓ అశోక్ రెడ్డి



నార్కట్ పల్లి సెప్టెంబరు 13(జనం సాక్షి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల సర్వేలో భాగంగా నల్లగొండ ఆర్డీవో వై.అశోక్ రెడ్డి నార్కట్ పల్లి రెవిన్యూ కార్యాలయంలో సూపర్వైజర్ల రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేలో ఎన్యుమరేటర్ అన్ని విషయాలను అడిగి తప్పులు లేకుండా క్షుణ్ణంగా ఫారంలో వివరాలను పూర్తి చేసేలా చూడాలని సూపర్వైజర్లకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ఎల్.వెంకటేశ్వర్ రావ్ తహసిల్దార్, ఎంపీడీవో కె.ఉమేష్, నయాబ్ తాసిల్దార్ రామకృష్ణ ,ఎంఈఓ నరసింహ,ఎంపిఎస్ఓమల్లికార్జున్,ఆర్ఐతరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఐకేపీ కేంద్రాలలో ధాన్యంకొనుగోళ్లను వేగవంతం చేయాలి

### రైతులకు రూ.500 బోనస్ అందించాలి

### బిఆర్ఎస్,నాయకులురాములుగౌడ్,వెంకట్ రెడ్డి



మాడ్గులపల్లి,నవంబర్ 13 (జనంసాక్షి):
వానాకాలం సీజన్ లో రైతులధాన్యం కొనుగోలుకు ఏర్పాటు చేసిన ధాన్యం కొను గోలు కేంద్రాలలో కొనుగోళ్లను వేగవంతంచేసి రూ.500 బోనస్ అందించాలని మాజీప్రాథమికవ్యవసాయసహకార సంఘం చైర్మన్ జేరిపోతుల రాములుగౌడ్,మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు మారుతి వెంకట్ రెడ్డి అన్నారు.బుధవారం మండల కేంద్రం లో ఏర్పాటు చేసిన విలేఖరులసమావేశంలో మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంహయాం లో కొనుగోలు చేసిన విధంగా ప్రభుత్వం ధన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధర అందిచాలన్నారు.వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల కారణంగా రైతులకు నష్టం జరగకుండా త్వరతరగతిన ఐకేపీ కేంద్రాలలోని ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు చెల్లిస్తామన్నా బోనస్ ను తక్షణమే ఎటువంటి షరతులు లేకుండా రైతుల ఖాతాల్లో జామ చేయాలన్నారు.కేసీఆర్ ప్రభుత్వం క్వింటాకు రూ 2850 గిట్టుబాటు ధర అందించగా నేడు క్వింటాకు. రూ 2300 లోపు మిల్లర్లతో కొనిపించేప్రయత్నంచేయలేకపోవడంస్థానికప్రజాప్రతినిధుల అసమర్థతకు నిదర్శనమన్నారు.ఈ కార్యక్రమంలోబిఆర్ఎస్ మండల నాయకులు వద్ది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం మండల పార్టీ కార్యదర్శిగా అవిశెట్టి శంకరయ్య



చిట్యాల సెప్టెంబర్ 13(జనం సాక్షి) సిపిఎం చిట్యాల మండల పార్టీ కార్యదర్శిగా అవిశెట్టి శంకరయ్య, సహాయ కార్యదర్శి గా కత్తుల లింగస్వామి లను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్ తెలిపారు.గుండ్రాంపల్లి గ్రామంలో మంగళవారం నాడు జరిగిన సిపిఎం మండల మహాసభ లో నూతనంగా కార్యదర్శి, సహాయ కార్యదర్శి లతో పాటు మండల కమిటీని ఎన్నుకున్నారని తెలిపారు.ఎంతో ఉత్సాహ పూరిత వాతావరణం లో జరిగిన ఈ మహాసభలో ఇరువై రెండు మంది మండల కమిటీ సభ్యులచే నూతన కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కార్యదర్శి , సహాయ కార్యదర్శి లతో పాటు మండల కమిటీ సభ్యులుగా జిట్ట నగేష్,అరూరి శ్రీను,జిట్ట సరోజ, ఐతరాజు నర్సింహా, బొబ్బిలి సుధాకర్ రెడ్డి, గుడిసె లక్ష్మినారాయణ, కల్లూరి కుమారస్వామి, కందగట్ల గణేష్, మెట్టు నర్సింహా,నెలికంటి నర్సింహా,లడే రాములు, మెట్టు పరమేష్,పంది నరేష్, కోనేటి రాములు, ఐతరాజు యాదయ్య, అక్కెనపల్లి నాగయ్య,నకిరేకంటి రాములు, దేశబోయిన సరస్వతి,జిట్ట స్వామి,మాదరబోయిన వెంకన్న లను మహాసభ ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు.అదేవిధంగా మండల కమిటీ ఆహ్వానితులుగా పామనుగుళ్ళ అచ్చాలు, రాచకొండ శ్యాంసుందర్ లను ఎంపిక చేసినట్లు తెలిపారు.

## త్రికుటేశ్వరాలయంలో అయ్యప్ప స్వాములకు అన్న దాన కార్యక్రమం

పెన్ పహాడ్ నవంబర్ 13 (జనం సాక్షి) :
మండల పరిధిలోని నాగులపహాడ్ గ్రామంలోని చారిత్రక త్రిపుటేశ్వరాలయంలో బుధవారం 80 మంది అయ్యప్ప స్వాములకు దాతలు అన్న ప్రసాద వితరణ చేశారు. అన్నదాన దాతలు.. మండలంలోని నాగులపాటి అన్నారం, గ్రామనికీ చెందిన యగ్గడి రాంప్రసాద్,బొలిశెట్టి శ్రీనివాస్, ఎడవెల్లి అశోక్ రెడ్డి, ఉపేందర్, తూము శ్రీనివాసరావు,చవగాని శ్రీనివాస్,గుడిబండ శ్రీకాంత్, బొలిశెట్టి పిచ్చయ్య,తమ్మనేని రమణారెడ్డి, బానోత్ సైదా నాయక్ ,ధరావత్ బిక్షం,కట్ట సుదర్శన్ లు కలిసి అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాదాన్ని అందించారు పురోహితుడు వెంకటరమణ శాస్త్రి ఆధ్వర్యంలో దామోదర కళ్యాణం నిర్వహించారు. అయ్యప్ప స్వాముల భజనలు. పాటలను భక్తులు ఆసక్తిగా తిలకించారు.ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు...






## 107ఆవులనుఅక్రమంగాతరలిస్తున్న 2 డిసిఎం వాహనాలు సిజ్

### గోశాలలకుతరలింపు,నిందితులపై కేసు నమోదు: ఎస్ఐ ఎస్.కృష్ణయ్య



మాడ్గులపల్లి, నవంబర్ 13 (జనంసాక్షి) ఇలాంటి అనుమతులు లేకుండా ఆవులను అక్రమంగా తరలిస్తున్న 2డిసిఎం వాహనాలు సిజ్ చేసిగోవులను గోశాలలకు తరలించి ,నిందితులపై కేసు నమోదు చేసినట్లు మాడ్గులపల్లి ఎస్ఐ ఎస్.కృష్ణయ్య తెలిపారు. బుధవారం తెల్లవారుజామున ఐదుగంటల సమ యంలో మాడ్గులపల్లి పోలీస్ లురాత్రిపెట్రోలింగ్, ముగించుకొని తిరిగి వస్తుండగా రెండు డీసీఎం లు కొద్ది సమయం తేడాలో అనుమానస్పాదంగా కనిపించడంజరిగిందన్నారు.రెండు డీసీఎం లు టిఎస్ 05 యుజీ 9912, టిఎస్ యు యుఎన్ 2806 లను తనిఖీ చేయగా అందులో పశువు లతరలింపు విషయంలో తీసుకోవాల్సిన కనీస అవసరాలు నీరు, గడ్డి, వైద్యసదుపాయంకల్పించ కుండా ఒకే డిసిఎం లో రెండు స్టెప్పులుగా రెండు డీసీఎంలలో 107 పశువులను తాళ్లతో క్రూరంగా కట్టిపడేదాన్ని గుర్తించడం జరిగిందన్నారు. రెండు డీసీఎంల డ్రైవర్లు రామావత్ మోహన్, నేనావత్ రఘు లనుఅదుపులోకి తీసుకోని విచారించగా, రెండు వాహనాలయజమానులు నేనావత్ శ్రీను, వడ్త్య శంకర్ ల ఆదేశాల మేరకే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా హనుమాన్ జంక్షన్ నుండి పశువులను హైదరాబాద్ లోని కబేళాలకు తరలిస్తున్నామమనితెలీపారు.పశువులనుఅక్రమ రవాణా చేస్తున్న డీసీఎం డ్రైవర్ల తోపాటుపశువుల ను అక్రమ రవాణా వ్యాపారం చేస్తున్న డిసిఎం యజమానుల పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.పట్టుబడిన గోవులను సంరక్షణ నిమిత్తం మండలంలోని ధర్మపురం, జిల్లాకేంద్రంలోని గోశాలలకు తరలించడం జరిగిందన్నారు.

# కామ్రేడ్ నరసింహ మరణం సిపిఐ పార్టీకి తీరని లోటు..



భూదాన్ పోచంపల్లి, నవంబర్ 13 (జనంసాక్షి):
పట్టణ కేంద్రంలోని సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు చేరాల నరసింహ మరణం సిపిఐ పార్టీకి, వారి కుటుంబానికి తీరనిలోటని సిపిఐ పార్టీ మండల కార్యదర్శి గోడల్లా నాగ భూషణ్ అన్నారు. బుధవారం నాడు సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు చేరాల నరసింహ గుండెపోటుతో మరణించారు. సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు వారి మృతదేహంపై ఎర్రజెండాను కప్పి, విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ మండల కార్యదర్శి గోడల్లా నాగ భూషణ్ మాట్లాడుతూ.. కామ్రేడ్ చేరాల నరసింహ సిపిఐ పార్టీలో రెండు పర్యాయాలు పోచంపల్లి మండల కార్యదర్శిగా పనిచేసారని, ఏఐటీయూసీ భవన నిర్మాణ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులుగా, పోచంపల్లి మండల భవన నిర్మాణ సంఘం ఏఐటీయూసీ వ్యవస్థాపక గౌరవ అధ్యక్షులుగా పనిచేసారని, మొదటి నుండి ఎర్రజెండా సిపిఐ పార్టీలోనే ఉన్నారని, ఆయన మరణంతో ఒక పెద్ద దిక్కును పార్టీ కోల్పోయిందని అన్నారు. సిపిఎం పార్టీ జిల్లా, రాష్ట్ర స్థాయిలో అనేకమంది పార్టీ నాయకులతో సంబంధాలు కలిగిన నాయకులు కామ్రేడ్ చేరాల నరసింహ అని, వారు మరణించడం పార్టీకి, కార్మిక వర్గానికి తీవ్ర నష్టం జరిగిందని అన్నారు. నరసింహకు విప్లవ జోహార్లు అర్పిస్తూ, సంతాపాన్ని తెలియజేస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మాజీ మండల కార్యదర్శి కామ్రేడ్ పబ్బు యాదయ్య, పట్టణ కార్యదర్శి మిరియాల కృష్ణమూర్తి, పార్టీ సీనియర్ నాయకులు సూర్కంటి సాయిరెడ్డి, వల్లందాస్ సోమయ్య , ముసునూరి రాములు, ముషం శివ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లు దించుకోవాలి



హుజూర్ నగర్, నవంబర్ 13 (జనంసాక్షి):
ఐకెపి కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లు దించుకోవాలని జాయింట్ కలెక్టర్ రాం బాబు అన్నారు. బుధవారం హుజూర్ నగర్ పట్టణంలోని ఆర్డిఓ కార్యాలయంలో రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ వ్యాపితంగా ధాన్యం దిగుబడి వస్తున్నందున రైసు మిల్లర్లు స్పందించి ధాన్యం తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ప్రైవేట్ ధాన్యం మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారని, ఐకెపి కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం గోడౌన్లలో నిలువ ఉంచినట్లయితే ధాన్యం తీసుకుంటామని మిల్లర్లు, జాయింట్ కలెక్టర్ కు తెలిపారు. ధాన్యం కొనుగోలుకు టోకెన్ సిస్టం విధానం అమలు చేస్తామని అధికారులు తెలియజేయగా, మిల్లర్లు ఒప్పుకున్నారు. ప్రభుత్వం 17% మ్యాచరు ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని అధికారికంగా తెలియజేస్తున్నప్పటికీ మిలర్లు మాత్రం రైస్ మిల్లర్స్ మాత్రం 14 శాతం మ్యాచరు ఉన్న ధాన్యం మాత్రమే కొనుగోలు చేయడానికి సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. 17% మ్యాచర్ ఉన్న ధాన్యం కొనుగోలు చేసినట్లయితే తమకు నష్టం వచ్చే అవకాశం ఉందని అనధికారికంగా మిల్లర్లు చర్చించుకుంటున్నట్లు తెలిసింది. ఈ సమావేశంలో డిఎస్ఓ రాజేశ్వర్, తహసిల్దార్ నాగార్జున రెడ్డి, డిటిసిఎస్ రాజశేఖర్, ఏవో స్వర్ణకుమారి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలిశెట్టి నరసింహారావు, రైస్ మిల్లర్స్ ఓరుగంటి నాగేశ్వరరావు, గుండా శ్రీనివాస్, వాసు, దొంగరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# టీజీపిఎస్సీ చైర్మన్ గా బీసీలకి అవకాశం కల్పించాలి

### కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని నిరూపించుకోవాలి:లింగంగౌడ్..



మిర్యాలగూడ,నవంబర్ 13(జనం సాక్షి)
తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ డిసెంబర్ 3న పదవీ కాలం పూర్తవుతున్న సంధర్భంగా నూతన చైర్మన్ గా బీసీలకి అవకాశం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి నేటి వరకు మంత్రుల నుండి కార్పొరేషన్ చైర్మన్ ల వరకు కేవలం ఒకే సామాజిక వర్గానికి పెద్ద పీట వేస్తూ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు అరకొర పదవులు మాత్రమే కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు ఒక ప్రక్క దేశమంతా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎవరి జనాభా ఎంతో వారికి అంత వాట దక్కాలని కాలికి బలపం కట్టుకొని తిరుగుతుంటే తెలంగాణ రాష్ట్రంలో మాత్రం దానికి విరుద్ధంగా వ్యవహరిస్తూ ఒకే ఒక కులానికి అన్ని పదవులు కేటాయిస్తూ సగానికి పైగా ఉన్న బీసీలను విస్మరిస్తున్నారని ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని నిరూపించుకోవాలంటే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ చైర్మన్ గా బీసీలకు అవకాశం కల్పించాలని లింగంగౌడ్ కోరారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలలో బీసీ అభ్యర్థులకు అవకాశం కల్పించాలి..

### తిరుమలగిరి అశోక్..



మిర్యాలగూడ నవంబర్ 13 ( జనంసాక్షి):త్వరలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి బీసీ అభ్యర్థులకు అవకాశం కల్పించాలని కోరుతూ మిర్యాలగూడలో బీసీ యువజన సంఘం సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో బీసీలకు అవకాశం కల్పించాలి. ఉపాధ్యాయ ఎన్నికలలో అత్యధికంగా బీసీ ఓట్లే ఉన్నప్పటికీ కూడా కొన్ని ఉపాధ్యాయ సంఘాలు అగ్రవర్ణాలకి అవకాశం కల్పిస్తూ ఉండడం బాధాకరం ఎందుకంటే మూడు ఉమ్మడి జిల్లాలలో అత్యధికంగా బీసీ ఓట్లు ఉన్నప్పటికీ కూడా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీసీ అభ్యర్థిని ఎందుకు నియమించట్లేదని ఆయన ప్రశ్నించారు బీసీలను అన్ని రంగాలలో అణచివేస్తూ వారి పబ్బం గడుపుకుంటున్నారు బీసీలను నేటికీ విద్య, ఉద్యోగ,రాజకీయ సామాజిక రంగాల్లో అణగ తొక్కుతూ బీసీల ఓట్లతో గద్దెనెక్కిన పార్టీలు, ఉపాధ్యాయ సంఘాలకు చెందిన బీసీ అభ్యర్థులను ఎందుకు చిన్నచూపు చూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు బీసీ అభ్యర్థులు ఎమ్మెల్సీ ఎన్నికలకు పనికిరారా అని ఆయన హెచ్చరించారు త్వరలో ఎమ్మెల్సీ ఎన్నికలలో బీసీ అభ్యర్థులకు కాకుండా అగ్రవర్ణాలకు అవకాశం కల్పిస్తే బీసీ సంఘాల నుండి అభ్యర్థిని నియమించి గెలిపించుకుంటామని ఆయన అన్నారు.. ఈ కార్యక్రమంలో ఎర్రబెల్లి గంగాధర్, గోవాడ కిరణ్, పర్సనబోయిన అనిల్, సైదులు, శంకర్, రమణ, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు


# పామాయిల్ రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం

పాలేరు నవంబర్ (13) జనంసాక్షి..
పామాయిల్ రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం పామాయిల్ రైతులకు ప్రభుత్వం నుంచి ఇచ్చే పెట్టుబడి ఎరువులకు ఇచ్చేవి 4200 రూపాయిలు.రెండు సంవత్సరాల నుండి.ఇవ్వటం లేదని రైతు.లువాపోతున్నారు కనీసం అధికారులు.సలహాలు ఇవ్వడం లేదు అధికారులను పెట్టుబడి ఎరువులకు ఇచ్చేవి.గురించి అడిగితే ఇంతకు ముందు మ్యాన్వాల్ల రైతుల ఖాతాలలోడబ్బుల్ వేషేవాళ్ళం.ఇప్పుడు యాప్. క్రియేట్.చేశాం. ఆ యాప్.లో రైతుల.సర్వ్.నెంబర్లు.అన్ని తీసుకోవటం లేదు.కొంత.మందికే.రావటం.లేదు అని అధికారులు చెప్పుతున్నారని.అసలు.వస్తాయా. రావా అని.రైతులు.ఆందోళన వ్యక్తం చేస్తున్నారు పైనంపల్లి .ఎలువారిగూడెం ఇలాకొన్ని.గ్రామాల.రైతులకు. సహాయం అందలేదని.కనీసం.పంటలకు ఎలాంటి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి ఎలాంటి పురుగు మందులు.వాడాలి. పర్టీలైజర్ వాడాలి అనిచెప్పి.అధికారులు.గాని. గోద్రెజ్ కంపెనీ. నుండీ గానిసలహాలు ఇచ్చే వారే. లేరనిప్రభుత్వం.మాత్రం ఎకరాకు.యాభై. వేలు. సబ్సిడీ. ఇస్తామని.చెప్పటమే.ఆచరణ.మాత్రం.లేదని రైతులు వాపోతున్నారు. అధికారులకు. ఎన్నిసార్లు చెప్పినా ఓపిక.పట్టండి.. అనాటమే కానీ.పనిజరగటం లేదు. వ్యవసాయ మంత్రి గారి.సొంత జిల్లా లోని. ఇలావుంటే పక్క జిల్లాల్లో పరిస్థితి. ఎలావుందో. అని రైతులు వాపోతున్నారు .

# నేడు కక్కిరేణిలో మూసి కార్తిక దీపోత్సవం

### మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి

### సామాజిక కార్యకర్త వేముల సైదులు




రామన్నపేట, నవంబర్ 13 (జనంసాక్షి):
మండలంలోని కక్కిరేణి గ్రామంలో గురువారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించే మూసి కార్తీక దీపోత్సవం కార్యక్రమానికి గ్రామ మహిళలు, ప్రముఖులు, పెద్దలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సామాజిక కార్యకర్త వేముల సైదులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని 14 గ్రామాలకు జీవనాధారమైన మూసి నది అనేక రకాలుగా కాలుష్య పొరలను అధికమించి, అలనాటి పూర్వం వైభవాన్ని, సంస్కృతిని, సాంప్రదాయాలను కాపాడుకోవడం కోసం రాష్ట్రంలోనే మొదటి ప్రయత్నం మన గ్రామం నుండే పునాది రాయిగా చరిత్రలో నిలిచేలా మూసీ నది యే మా జీవన విధానం అంటూ మూసి కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని మన గ్రామంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మనం అందరం కలిసి కట్టుగా పర్యావరణ పరిరక్షణ కోసం ప్రకృతిని కాపాడుకోవడం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ సైంటిస్ట్ యన్.సాయి భాస్కర్ రెడ్డి, జలసాధన సమితి జాతీయ అధ్యక్షులు, గ్రీన్ హార్ట్ ఆఫ్ ఇండియా దుశ్చేర్ల సత్యనారాయణ, డాక్టర్ నవీన్ కుమార్, డి.ఉదయ్ కుమార్ హాజరు కానున్నారని తెలిపారు.

# ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు



కోదాడ,జనంసాక్షి:
సూర్యాపేట జిల్లా కేంద్రంలో సదిశ ఫౌండేషన్ వారు ఈ నెల10న జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలలో చదివే టెన్త్ విద్యార్థిని,విద్యార్థులకు నిర్వహించిన గణిత ప్రతిభా పరీక్షలో నడిగూడెం మండలం సిరిపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మొక్కా రేష్మా, మొక్కా సురేష్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు దర్రా ఉపేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎంపికైన విద్యార్థులకు వచ్చే 2025-27 విద్యా సంవత్సరంలో 'సదిశ' ఫౌండేషన్ వారు ఇంటర్ విద్యను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు దర్రా ఉపేందర్,ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# అధికారులపై దాడి చేసింది బీఆర్ఎస్ గుండాలే : గొడిశాల రామనాధం

◆ ఎమ్మెల్యే పాయం మీద చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ కౌంటర్.. ◆ పది రోజుల్లో మంత్రి అన్నావు... పత్తా లేకుండా పోయావు..



పినపాక, నవంబర్ 13(జనం సాక్షి): వికారాబాద్ జిల్లాలో జిల్లా కలెక్టర్, ఇతర అధికారులపై జరిగిన దాడి వెనుక బీ ఆర్ ఎస్ అరాచక శక్తుల కుట్రేనని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గొడిశాల రామనాధం అన్నారు. బుధవారం క్రాస్ రోడ్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పినపాక నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సోషల్ మీడియా సాక్షిగా చేసిన వ్యాఖ్యలు వారి దిగజారిన రాజకీయాలకు అద్దం పడు తుంది అని అన్నారు. రాజకీయాలలో హుం దాగా మాట్లాడాలని చెల్లని రూపాయి మాటలు మాట్లాడి, ప్రజల్లో ఇంకా చులకన కావోద్దని హితవు పలికారు. పది రోజుల్లో మంత్రిని అయ్యి వస్తా అన్నావు పత్తా లేకుండా పోయావు. అధికారం కోసం అర్రులు చాచటం మీకే చెల్లిందన్నరు. ఇక నైనా బుద్ధి తెచ్చుకుని గౌరవప్రద రాజ కీయాలు చేయాలని సూచించారు. వికారా బాద్ లో బీఆర్ఎస్ ప్రేరేపించిన గూండా లను తక్షణమే అరెస్టు చేసి, శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం లో మాజీ వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉడుముల లక్ష్మారెడ్డి, గంగిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీనివాస రెడ్డి, బండారు సాంబశివరావు, స్వతంత్ర రెడ్డి, పాయం అప్పారావు, పాడి హేమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

## ఎస్ఐలు రాజ్ కుమార్, రాజేందర్..



పినపాక, నవంబర్ 13(జనంసాక్షి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం, బయ్యారం క్రాస్ రోడ్ నందు గల ఎక్సలెంట్ భాషా హై స్కూల్ నందు విద్యార్థిని విద్యార్థులకు బయ్యారం, కరకగూడెం పోలీస్ స్టేషన్ ఎస్ఐలు రాజ్ కుమార్, రాజేందర్ ఆధ్వర్యంలో గంజాయి, డ్రగ్స్ నియంత్రణ వాటిని వాడటం వలన ఎదురయ్యే అనర్థాలపై పాఠశాల విద్యార్థినీ విద్యార్థులతో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై రాజ్ కుమార్ మాట్లాడుతూ యువత విద్యాపరంగా ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని, డ్రగ్స్, గంజాయి మాదకద్రవ్యాలకు బానిసై తమ విలువైన విద్య జీవితాన్ని కోల్పోవద్దని ఎస్సై రాజకుమార్ పిలుపునిచ్చారు. డ్రగ్స్ నియంత్రణలో భాగంగా యువత పోలీస్ శాఖకు సమాచారం అందించినట్లయితే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకోవడంలో భాగస్వాములు అవుతారన్నారు. డ్రగ్ నియంత్రణలో భాగంగా వారం రోజులపాటు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు ,ర్యాలీలను నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బి సి నూతన కన్వీనర్ గా వి వెంకట్రావు గౌడ



మణుగూరు, నవంబర్ 13 (జనంసాక్షి): మణుగూరు మండలం బిసి వెనుకబడిన తరగతులు కుల ఐక్యవేదిక సదస్సు మణుగూరు లోని పద్మశాలి భవన్లో సుమారు వందమంది వివిధ కులాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా సోమేశ్ గౌడ్ గారు జి వెంకటేశ్వర్లు వలసాల రామారావు, పున్నం బిక్షపతి దుస్స సమ్మయ్య బొడ్డుపల్లి చంద్రమౌళి, మెరుగు రవి హాజరై మాట్లాడారు...మన సంఖ్య బలం ఎక్కువుగా ఉన్నా రాజకీయ ఆర్థికంగా ఎదగ లేక పోవటం బాధాకరం అన్నారు. వెనుకబడిన తరగతుల వారం అందరం కలిసి మన హక్కుల కోసం రాజకీయలకు అతీతంగా ఉండాలని భవిష్యత్తులో బీసీ హక్కులను సాధించటం కోసం హడక్ కమిటీని వెయ్యాలని తీర్మానం చేసామన్నారు.బుధవారం నూతన హడాక్ కమిటీని ఎన్నుకోవడం జరిగింది.అన్నారు.కన్వీనర్ వీరంకి వెంకట్రావు గౌడ్ ఇద్దరు కో కన్వీనర్లు గా నాగారపు సతీష్ కుమార్, శ్రీరాముల రజాక్ సంఘం గుడి కందుల ప్రసాద్ పద్మశాలి రుద్ర వెంకట్ వడ్డెర సంఘం పెనుగొండ సాంబశివరావు , మేకపోతు వెంకటేశ్వర్లు కాపు సంఘం కడప వెంకటేశ్వర్లు కుమ్మరి సంఘం తెగుల శ్రీను, గొల్ల కురుమ సంఘం కంప రవి, ముదిరాజ్ సంఘం పురం రవి పూసల సంఘం కోటిలింగం మైనారిటీ దూదేకుల యాకుబ్ అలి. కోడి అశోక్ కుమార్ ఎన్నుకోవటం జరిగింది.

# ఇల్లందు మున్సిపల్ కమిషనర్ కార్మికుల సమస్యలతో కూడిన వినతిపత్రం

## - షేక్ యాకుబ్ షావలి




ఇల్లందు, నవంబర్14(జనంసాక్షి):
ఇల్లందు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్, టియుసిఐ అనుబంధం ప్రతినిధిబృందంతో కలిసి మున్సిపల్ కార్మికుల సమస్యలు వివరించారు.అనంతరం ట్రేడ్ యూనియన్స్ సెంటర్ ఆఫ్,ఇండియా టియు సిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి షేక్ యాకుబ్ షావలి, కమిషనర్ గారికి వివరిస్తూ, మున్సిపల్ కార్మికులకు పెండింగ్, పిఆర్సి , పీఎఫ్, మేడే కానుక పలు సమస్యలు పెండింగ్ ఉండడం వలన కార్మికులు ఇబ్బంది పడుతున్నారని తెలియజేశారు. పై సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు మున్సిపల్ కమిషనర్ కి వివరించారు.కమిషనర్ కార్మికుల సమస్యల మీద సానుకూలంగా స్పందించారు. సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రాష్ట్ర నాయకులు సిహెచ్ కుమార్ ఇల్లందు బ్రాంచ్ నాయకులు ఉమా, ఎల్లాబాయ్, సిహెచ్ దుర్గ, బోయపోతుల వెంకన్న, దొరపల్లి వీరస్వామి, కూతాడిపద్మ, ఎం రాజు వరలక్ష్మి, నాగమణి, ఉప్పరి కృష్ణ, జోష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రమణీయం కమనీయం కల్లూరు పల్లె ప్రకృతి వనం

## సందర్శకులను ఆకర్షించే విధంగా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దిన ఈవో నాగేశ్వరరావు



కల్లూరు నవంబర్ 13(జనంసాక్షి) కల్లూరు గ్రామపంచాయతీ శివారు పెద్ద చెరువు కట్ట సమీపాన ఫ్లోరైడ్ రహిత రక్షిత మంచినీటి ప్రాజెక్టు ఆవరణలో విశాలమైన ప్రాంగణం లో సందర్శకుల కోసం ఏర్పాటుచేసిన పల్లె ప్రకృతి వనం రమణీయం కమనీయంగా తయారయింది.
కల్లూరు పట్టణ పరిధిలోని పలువురు సందర్శకులు, ప్రకృతి ప్రేమికులు తమ కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి పల్లె ప్రకృతి వనంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల మొక్కలను పూల చెట్లను ఆకర్షణీయంగా ఉన్నటువంటి వివిధ భంగిమలతోఉన్న కళా నైపుణ్యం గల ఆకృతులను సందర్శించి పరవశించి పోతున్నారు. కల్లూరు పంచాయతీ పరిధిలోని పల్లె ప్రకృతి వనంలో ఇటీవల విపరీతమైన చెత్త ,కంప చెట్లు , గడ్డి పెరిగి పరిసరాలు అస్తవ్యస్తంగా తయారైనాయి. దీంతో సందర్శకులు అవస్థలు పడ్డారు. పల్లె ప్రకృతి వనములో అస్తవ్యస్తంగా తయారైన పరిసరాలను శు భ్రపరచి , జంగిల్ క్లియరెన్స్ చేసి సందర్శకులకు పచ్చని వాతావరణం కల్పించాలని పలువురు ఇటీవల గ్రామ పంచాయతీ కార్యదర్శి నంది శెట్టి నాగేశ్వరావు దృష్టికి సమస్యను తీసుకెళ్లడం జరిగింది. దీంతో స్పం దించిన ఈవో నాగేశ్వరరావు ప్రత్యేక దృష్టి సారించి జంగిల్ క్లియరెన్స్, పరిసరాల పరిశుభ్రత, అస్తవ్యస్తంగా తయారైన కంపచెట్లను తొలగించి చక్కటి వాతావరణాన్ని కల్పించారు. అదేవిధంగా పల్లె ప్రకృతి వనంలో వివిధ రకాల పూల మొక్కలు కళా ఆకృతులను అందంగా పలు రకాల డిజైనింగ్ కలర్స్ తో సందర్శకులను ఆకర్షించే విధంగా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. కార్తీక మాసంలో కుటుంబ సభ్యులు వన సమారాధన కార్యక్రమాలు నిర్వహించు కునే విధంగా పల్లె ప్రకృతి వనానికి పునర్జీవం పోశారు. ఇదే తరుణంలో పలువురు సందర్శకులు పల్లె ప్రకృతి వనంలో అరుదైన మొక్కల వద్ద ఫోటో షూట్ చేసుకుంటున్నారు. పచ్చని చెట్లతో కళకళలాడుతూ ఆహ్లాదకరమైన వాతా వరణాన్ని కల్పిస్తూ పల్లె ప్రకృతి వనాన్ని అత్యంత సుందరంగా తీర్చి దిద్దటం పట్ల హర్ష వ్యక్తం చేస్తూ, పంచాయతీ ఈవో నంది శెట్టి నాగేశ్వరరావుకు ప్రజలు, ప్రకృతి ప్రేమికులు అభినందనలు తెలియజేస్తున్నారు.




# భద్రాద్రి రామాలయంలో డిజిటల్ సేవలు ప్రారంభం

భద్రాచలం నవంబర్ 13 (జనం సాక్షి):
భద్రాచలం సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో బుధవారం వివిధ రకాల డిజిటల్ సేవలను భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు దంపతులు ప్రారంభించారు. రామాలయంలో ఏ రోజు ఏమి సేవలు జరుగుతాయో గతంలో భక్తులకు తెలిసేది కాదు. దీనివల్ల భక్తులు స్వామి వారి సేవలను వినియోగించుకోలేక పోయేవారు. దీంతో అన్ని సేవలు భక్తులకు అందుబాటులోకి తీసుకుని వచ్చేలా దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా దేవస్థానంలో నూతనంగా డిజిటల్ సేవలను ప్రవేశపెట్టారు.ఇప్పటికే సుదూర ప్రాంతాలలోని భక్తుల సౌకర్యం కొరకు వసతి తో పాటు 24 రకాల సేవలకు సంబంధించిన టికెట్స్ భక్తులకు ఆన్లైన్ లో లభ్యం అవుతున్నాయి. డిజిటల్ సేవలకు భక్తుల నుంచి అనూహ్య స్పందన వస్తుండడంతో అన్నదానం, ప్రోటోకాల్, స్వామివారికి వస్త్ర సమర్పణ, మూడు నూతన డిజిటల్ సేవలను భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈ ఓ రమాదేవి, ఈ ఈ రవీందర్ ఏ ఈ ఓ లు భవాని రామ కృష్ణ, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# రామయ్య సేవలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

భద్రాచలం, నవంబర్ 13 (జనంసాక్షి): భద్రాచలం సీతారామచంద్ర స్వామివారిని బుధవారం తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన వారికి దేవస్థానం ఈవో రమాదేవి, అర్చక స్వాములు మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. ధ్వజస్తంభంవద్ద నమస్కరించుకొని, అంతరాలయంలో మూలమూర్తుల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీ తాయారు అమ్మ వారిని, భద్రుని కోవెలను, ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. లక్ష్మీ తారమ్మ వారి సన్నిధిలో అర్చకులు వారికి వేదాశీర్వచనం చేసి స్వామి వారి ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ట్రైబల్ వెల్ఫేర్ డిడి మణెమ్మ, ఏవో రాంబాబు, ఏ ఈ ఓ శ్రావణ్ కుమార్, ఏసీఎంఓ రమణయ్య, డీఎస్ఓ ప్రభాకర్ రావు, ఏటీడీవో చంద్రమోహన్, తహసిల్దార్ శ్రీనివాస్, దేవస్థానం పర్యవేక్షకుడు సాయిబాబా, ఆర్ ఐ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



# ఔషధ మొక్కలు పంపిణీ

## ఒక హృదయం వ్యవస్థాపకులు సంజీవరెడ్డి..

బూర్గంపహాడ్ నవంబర్ 13 (జనంసాక్షి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక ఒక హృదయం స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో క్యాన్సర్ పై అవగాహన కల్పిస్తూ ఔషధ మొక్కలు పంపిణీ చేశారు. జిల్లాలోని అశ్వాపురం, మణుగూరు, పినపాక, కరకగూడెం మండలాలలో అంతేకాకుండా ములుగు జిల్లాలోని మంగపేట, వాజేడు, ఏటూరు నాగారం మండలాలలో ఉన్న హైద్వ సభ్యులను కలిసి 200 బెటర్ లీఫ్ ఔషధ మొక్కలను వారికి అందించారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని కాలుష్యం నివారణకు మొక్కలు నాటితేనే మన జీవనశైలి సక్రమంగా మారుతుందని, క్యాన్సర్ కు నివారణ ఒక్కటే మార్గమని, ప్రతి ఒక్కరికి ఔషధ గుణములు కల మొక్కలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, రాజు, మల్లెల మోహన్, వెంకన్న, లింగయ్య, మణుగూరు సిపిఐ కార్యదర్శి సుజాత, రవీంద్ర, పినపాక మండలం సిపిఎం పార్టీ కార్యదర్శి శంకరయ్య, వాజేడు మండలం ఐద్వా మహిళా సంఘం సౌమ్య, నాగలక్ష్మి, యశోద లకు మొక్కలు అందజేశామని ఆ సంస్థ జనరల్ సెక్రటరీ ముదిగొండ వరలక్ష్మి తెలిపారు.

# పాల్వంచ వాసికి ప్రతిష్ఠాత్మక డాక్టరేట్ ప్రధానం





పాల్వంచ, నవంబర్ 13 (జనంసాక్షి) : పాల్వంచ పట్టణ సమీప సీతారాంపట్నంకు చెందిన వాసిరెడ్డి శేషయ్య మనువడు దమ్మాలపాటి రామ్‌కుమార్ వర్మకి ప్రతిష్ఠాత్మక నోయిడా ఇంటర్‌నేషనల్ యూనివర్శిటీ నుండి ఇంగ్లీష్ పిహెచ్‌డి డాక్టరేట్ పొందారు. రామ్‌కుమార్ వర్మ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎబి నెగిటివ్ రక్తదానాన్ని 98 సార్లు చేశారు. అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఖమ్మంలో శ్రీ చైతన్య విద్యా సంస్థల్లో పిజిటి ఇంగ్లీష్ ఫ్యాకల్టీగా చేస్తున్నారు. రక్తదానం మాత్రమేకాకుండా 2023 సంవత్సరానికి గాను బెస్ట్ లాంగ్వేజ్ టీచర్‌గా బెస్ట్ ఐడియల్ టీచర్‌గా అవార్డులు పొందడమే కాకుండా ఇప్పటి వరకూ 7 పుస్తకాలు రాయడంతో పాటు పిల్లలను ఆంగ్లంలో రాణించే విధంగా తీర్చి దిద్దిడంతో గురువుగా తనవంతు కృషి చేస్తున్నారు. పిహెచ్‌డి డాక్టరేట్ సాధించడం పట్ల పలువురు సంతోషం వ్యక్తం చేశారు.



# సమ్మెకు సిద్ధంకండి

## సిఐటియు జిల్లా అధ్యక్షులు బ్రహ్మాచారి

భద్రాచలం, నవంబర్ 13 (జనం సాక్షి):
గిరిజన కార్మికులు గత ఏడు రోజులుగా 'ఆకలి కేక' పేరిట ఐటీడీఏ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వంగాని, జిల్లాలోని ఎమ్మెల్యేలు గానీ ఏమాత్రం స్పందించడం లేదని, కార్మికులందరూ నిరవధిక సమ్మెకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కె బ్రహ్మాచారి పిలుపునిచ్చారు. ఏడవ రోజు దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఆకలిబాదలు తీర్చండి లేదంటే సమ్మె చేస్తామని పియంహెచ్చ్ హాస్టల్ వర్కర్స్ నోటీస్ఇచ్చి దీక్షలుచేస్తున్నప్పటికి ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని విమర్శించారు. జిల్లాలో ఉన్న నలుగురు గిరిజన ఎమ్మెల్యేలకు గాను ముగ్గురు గిరిజన ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందజేశామని వారు సైతం సమస్యపై అంటి ముట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం యొక్క మొండి వైఖరి విడనాడాలని, వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నాగరాజు తోపాటు దీక్షల్లో హాస్టల్ వర్కర్స్ యూనియన్ నాయకులు , జయ, తిరుపతమ్మ,, రాజ్యలక్ష్మి, శ్రీను, సుభద్ర, కుమారి, వీరి, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



# పంచాయతీ కార్మికుడు మరణానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

## కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే అందుకోవాలి

ములకలపల్లి, నవంబర్ 13 జనంసాక్షి:
ప్రమాదవశత్తు గ్రామపంచాయతీ కార్మికుడు బాణోత్ తరుణ్ మరణానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏండి యూసుఫ్, సిఐటియు మండల కన్వీనర్ నిమ్మల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్మికుడు బాణోత్ తరుణ్ మరణానికి గ్రామ పంచాయతీ కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రహదారి పై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జూలురుపాడు మండలం చింతల తండా గ్రామ పంచాయతీ లో మల్టీ పర్పస్ వర్కర్ గా విధుల లో భాగంగా బాణోత్ తరుణ్ విధి దీపాలు మార్చడానికి కరెంటు స్తంభాం ఎక్కి అమరుస్తుండగా ప్రమాదవశాత్తు కరెంటు వైరు తగిలి అక్కడే మరణించాడు మరణించిన గ్రామ పంచాయతీ కార్మికుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గ్రామ పంచాయతీ కార్మికుడు బాణోత్ తరుణ్ మరణానికి కారకులైన స్థానిక అధికారుల పై చర్యలు తీసుకోని తన కుటుంబాని ప్రభుత్వం బారోస కల్పించి 10 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులకు ప్రమాద బీమా ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని లేనియెడల భవిష్యత్ పోరాటాలకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ కార్మిక జేఏసీ నాయకులు గంటా శ్రీనివాసరావు, చిక్కుల శ్రీనివాస్, వగ్గేల దారయ్య, మేకల రమేష్, కనకం చిన్నయ్య, ఏసుబాబు, బత్తుల సంజీవరావు, కుంజా రవి, బాబురావు, పోక్కిలి నరేష్, కొక్కెరగడ్డ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# వివిధ సమస్యలపై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ని కలిసిన జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ లకావత్



భద్రాచలం నవంబర్ 13 (జనంసాక్షి): జిల్లాకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ తెగల, షెడ్యూల్ కులాల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ని జిల్లాలో ఉన్న వివిధ సమస్యలపై జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ లకావత్ వెంకటేశ్వర్లు వారి దృష్టికి తీసుకువెళ్లి, ఈ మేరకు బుధవారం ఆయనకు వినతిపత్రం అందించారు. ఎన్నో ఏళ్లుగా ఐటిడిఎ పరిధిలో ఖాళీగా ఉన్న ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టులను గిరిజన ప్రాంతం నిరుద్యోగులతో భర్తీ చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో ఖనిజ సంపద ఎంతో ఉందని, అలాగే ఇసుక రీచులను ప్రారంభించి గిరిజన సొసైటీల ద్వారా జీవనోపాధి కల్పించాలని తెలిపారు. ఐటిసి పి ఎస్ పి డి, నవభారత్ వెంచర్ లిమిటెడ్ లో గిరిజనుల కు జీవనోపాది కల్పిస్తూ వాటి అనుబంధ పరిశ్రమలలో సివిల్, నాన్ సివిల్ పనులలోవారికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పాల్వంచ మండలం తోగ్గూడెం గ్రామంలో బినామీ పేర్లతో నిర్వహిస్తున్న క్వారీలను రద్దు చేయాలని విన్నవించారు. ఐటిసి పిఎస్పీడీ వారు ఈ ప్రాంతంలో ప్రజల వైద్యం కొరకు ఒక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని కోరారు. సింగరేణి, కెటిపీఎస్, బీటీపీఎస్ లలో ఎస్సీ, ఎస్టి లెజనింగ్ ఆఫీసర్లను నియమించాలని వివరించారు. ప్రభుత్వం నిర్వహించే టెండర్లపనులలో ఎస్సీలకు 15%, ఎస్టిలకు 10% అవకాశం కల్పించాలని కోరారు.



## మట్టి గోడల ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన

భద్రాచలం నవంబర్ 13 (జనంసాక్షి):

భద్రాచలం ఐటిడిఏ ట్రైబల్ మ్యూజియం ప్రాంగణంలో టూరిస్టుల కొరకు త్వరలో ఆదివాసులకు సంబంధించిన మట్టి గోడలతో ఇంటి నిర్మాణం చేపట్టేందుకు బుధవారం గుంజ వేయడానికి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఆదివాసి సంఘం డివిజన్ నాయకులు సోందె మల్లుదొర, కూరం బొర్రయ్య, కారం గోపాల్ పూజారులుగా వ్యవహరించి మొదటిగా ఆదివాసి సాంప్రదాయం ప్రకారం పిఓ బి రాహుల్ చే వనదేవతలను స్మరిస్తూ ఆదివాసులకు సంబంధించిన గట్టు గో త్రముల, పితృ దేవుళ్లను మొక్కి ముహూర్తం గుంజ అయిన పాలకర్రకు తోరణాలతో, కంకణాలతో అలంకరించి గోతిలో పి ఓ తో, ఆర్డిఓతో నవధాన్యాలు, పసుపు కుంకుమతో వేయించి కొబ్బరి కాయలు కొట్టి ముహూర్తం గుంజను వేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి మహిళ చైతన్య శక్తి నాయకులు కోంద్రు సుధారాణి, శీలం దుర్గ, కమల, ఐటీడీఏ వివిధ శాఖలకు సంబంధించిన ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ..

### తాళ్లూరి ట్రస్టు ఆధ్వర్యంలో..



బూర్గంపహాడ్ నవంబర్ 13 (జనంసాక్షి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల పరిధిలోని ఇరవెండి గ్రామం లో తాళ్లూరి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రవాస భారతీయులు, తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్, నీలిమ దంపతుల సౌజన్యంతో బుధవారం 12 సైకిళ్లను పాఠశాల విద్యార్థినులకు ట్రస్టు చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య పంపిణీ చేశారు. పాఠశాలలకు వెళ్లే నిరుపేద బాలికలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వాటిని పంపిణీ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ముున్ముందు ట్రస్టు ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతా మని ట్రస్టు చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు డైరెక్టర్, మాజీ ఎంపీటీసీ వల్లూరిపల్లి వంశీకృష్ణ, విజయ రేణుక, జగన్మోహన్, వనమా రాజేశ్వరరావు, పాఠశాల హెచ్ఎం హేమశ్రీ పాల్గొన్నారు.

## పశువులకు చికిత్సా శిబిరం

బూర్గంపహాడ్ నవంబర్ 13 (జనంసాక్షి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల పరిధిలోని ముసలిమడుగు గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సా శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ శిబిరంలో పశువులకు వైద్యులు రాజేందర్ 40 గేదెలకు చూడు పరీక్షలు, గర్భకోశ వ్యాధి చికిత్సలు నిర్వహించి 30 దూడలకు నట్టలమందు తాగించారు. పాడి రైతులకు పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన మెళకువలు, జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్రలు టి గోవిందరెడ్డి, సీహెచ్ కిరణ్, నాగేశ్వరరావు, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.





## మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

### - ఐకేపీ ఏపీఎం నాగార్జున

బూర్గంపహాడ్ నవంబర్ 13 (జనంసాక్షి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం ఐటీసీ బందన్ సంస్థ సౌజన్యంతో మండలంలో నిరుపేద మహిళలు జీవనోపాధి పొందుతున్నప్పటికీ స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధితో మరింత ఆర్థికంగా ఎదగాలని ఐకేపీ ఏపీఎం నాగార్జున అన్నారు. బుధవారం ఐటీసీ బంధన్ సంస్థ ఆధ్వర్యంలో బూర్గంపహాడ్ లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఒంటరి, వితంతు మహిళలతో పాటు నిరుపేదలకు ఐటీసీ బంధన్ సంస్థ రూ.12వేలు జీవనోపాధికి అవసరమైన వాటిని అందించి ఆర్థికంగా ఎదిగేలా చేస్తున్నారని, ఐకేపీ ద్వారా ఆ నిరుపేద మహిళలు స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసుకోవాలని, ఒకవేళ సంఘంలో సభ్యులుగా ఉంటే వారికి బ్యాంకు లింకేజీలు ఇవ్వడం జరుగుతుందని, వచ్చిన నగదుతో వారి వ్యాపారాన్ని మరింత విస్తరించి ఆర్థిక భరోసా పొందాలన్నారు. మహిళలు కుట్టు మిషన్లు, బట్టల దుకాణం, ఫ్యాన్సీ షాపు, కూరగాయలు, పండ్ల దుకాణాలు ఏర్పాటుకు బంధన్ సంస్థ ఇప్పటికే ఆర్థికంగా భరోసా కల్పించిందని, ఆ వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేరాలని, చేరిన వారు రుణాలు పొంది తిరిగి చెల్లించి జీవనోపాధిని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ బంధన్ సంస్థ ఏరియా కోఆర్డినేటర్ ఉత్తమ్, మారజిత్, ఉమ్మల సుమన్, భూక్యా కుమార్, చిరువ్యాపారులు పాల్గొన్నారు.



## డ్రగ్స్ రహిత సమాజం ప్రతి ఒక్కరి బాధ్యత

### దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి..

దమ్మపేట

దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో కొత్తగూడెం జిల్లా ఎస్పీ ఆదేశానుసారం పాల్వంచ డిఎస్పి సూచనల మేరకు అశ్వరావుపేట సిఐ ఆధ్వర్యంలో దమ్మపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో మాదకద్రవ్యాల వాడకం నిషేధించడానికి డ్రగ్స్ రహిత సమాజాన్ని ఏర్పరచటానికి ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని అక్షరాస్యులు నిరక్షరాస్యులు అనే భేదం లేకుండా సమాజ శ్రేయస్సుకై ప్రతి ఒక్కరు కృషి చేయాలని విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరు ఉన్నత విలువలతో కూడిన సంస్కారాన్ని అలవర్చుకోవాలని సమాజం పట్ల పెద్దలపట్ల వినయ విధేయతలు చూపుతూ చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ప్రతి ఒక్కరూ సమాజ శ్రేయస్సు కై పాటుపడాలని దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి,బాలస్వామి,కానిస్టేబుల్ నాగముత్యం,రాజులు,నరసింహారావు తో పాటుగా పాఠశాల సిబ్బంది,విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





## కళ్లెం ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కందాళ

ఖమ్మం రూరల్, నవంబర్ 13:(జనం సాక్షి )

మండలంలోని గోళ్ళపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కెళ్ళేం వెంకటరెడ్డి ఇటీవల మోకాలు మార్పిడి శాస్త్రి చికిత్స జరిగింది. విషయం తెలుసుకున్న పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి గోళ్లపాడు గ్రామంలోని వెంకటరెడ్డి ఇంటికి వెళ్లి బుధవారం పరామర్శించారు.. అదేవిధంగా గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి నిర్మాణం కొరకు సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో మృతి చెందిన వీరబాబు కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ సభ్యత ఇన్సూరెన్స్ రెండు లక్షల చెక్కును బాదిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలు అధైర్య పడవద్దని వారి కోసం పార్టీ ఎప్పుడూ అండగానే ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, మాజీ జెడ్పిటిసి యండపల్లి వరప్రసాద్,ఎదులపురం సొసైటీ చైర్మన్ జరుపుల లక్ష్మణ్ నాయక్, స్థానిక బిఆర్ఎస్ నాయకులు, సిపిఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సిపిఐ నూరేళ్ళ ఉత్సాహం ఉరకలేయాలి

- పార్టీ పురోభివృద్ధికి సైనికుల్లా పని చేద్దాం
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా

**భద్రాచలం, నవంబర్ 13 (జనంసాక్షి):**

భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆవిర్భవించి వందేళ్లు అయిన సందర్భంగా ఆ ఉత్సాహంతో నాయకులు కార్యకర్తలు పార్టీ సానుభూతిపరులు పార్టీ పురోభివృద్ధికి సైనికుల్లా ఉరకలేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.కె సాబీర్ పాషా అన్నారు. బుధవారం స్థానిక పార్టీ డివిజన్ కార్యాలయంలో డివిజన్ స్థాయి సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల తాతాజీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 1925 వ సంవత్సరంలో పేదలు బడుగు బలహీన వర్గాలు కార్మికులు కర్షకుల కోసం సిపిఐ పార్టీ ఆవిర్భవించిందని అన్నారు. ఈ నూరేళ్లలో అనేక కష్టాలు నష్టాలు ఆటుపోట్లు ఎదురయ్యాయని., ఈ సుదీర్ఘ పోరాటంలో ఎన్నో త్యాగాలు ఉన్నాయని అన్నారు.. ఎన్నో పార్టీలు పుట్టుకొచ్చినప్పటికీ ప్రజల పక్షాన నిలబడిన పార్టీ సిపిఐ ఏ అని అన్నారు. సిపిఐ ని లేకుండా చేద్దామని అనేక శక్తులు వ్యక్తులు ప్రయత్నించినప్పటికీ వారే కనుమరుగయ్యారని, నేటికి కూడా ఎర్రజెండా రెపరెపలాడుతూనే ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య, రాష్ట్ర సమితి సభ్యులు కల్లూరు వెంకటేశ్వరరావు, తోట మల్లికార్జునరావు, రావులపల్లి రవికుమార్, నారాటి ప్రసాద్, ఆచంటి ప్రసాద్, నూప పోతయ్య, పాల్వంచ రామారావు, నూపా తిరుపతి, భద్రాద్రి వెంకటేశ్వరరావు, ఎల్లారెడ్డి, ఎస్వీఎస్ నాయుడు, కృష్ణ, రాము, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## నూజివీడు సీడ్స్ వారి శ్రీ అన్నపూర్ణ విత్తనాలపై రైతులకు అవగాహన...

నిడమనూరు (జనంసాక్షి)
నిడమనూరు మండలము పార్వతీపురం గ్రామానికి చెందిన ఓబినేని థ్ ఆంజనేయులు సాగుచేసిన నూజివీడు సీడ్స్ శ్రీ అన్నపూర్ణ వరి పంట పై క్షేత్ర స్థాయిలో రైతులకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నూజివీడు సీడ్స్ నేషనల్ సేల్స్ మేనేజర్ ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతు నూజివీడు సీడ్స్ గత 50 సంవత్సరాలకు పైగా రైతులకు నాణ్యమైన మరియు ఆధునిక పద్ధతిలో విత్తనాలు అందిస్తున్నమన్నారు. నూజివీడు సీడ్స్ విత్తనాలు వేయడం వలన ఖర్చులు తగ్గి దిగుబడులు పెరుగుతుందని దీనివల్ల రైతు ఆర్థికంగా మెరుగుపడతారని ఆయన అన్నారు. అన్నపూర్ణ ఎన్ పి 7373 రకం మంచి ఫలితాలు ఇస్తుందన్నారు, పైరు అడ్డం పడదు, బి ఎల్ బి తెగులును సమర్థవంతంగా తట్టుకునే శక్తి ఈ వంగడానికి ఉంటుందని సూచించారు. ప్రతీ కంకిలో అధిక గింజలు ఉండడంతో దిగుబడి కూడ అధికం గా వస్తుంది అన్నారు. వానాకాలం, యసంగి రెండు పంటలకు అనుకూలం, ఉంటుందని తెలిపారు. గత 30 సంవత్సరాలుగా నూజివీడు కంపనీ విత్తనాలు విక్రయిస్తున్నామని తీసుకెళ్లిన ప్రతీ రైతు సంతోషం వ్యక్తం చేస్తున్నారని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొల్లం జయమ్మ, మాజీ సర్పంచ్ వంక బ్రహ్మన్న, బొల్లం రవి, సతీష్, ఆర్ ఎం రాములు, కోటేశ్వరరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయునికి ఆత్మీయ వీడ్కోలు అభినందన సన్మానం

రామన్నపేట, నవంబర్ 13 (జనంసాక్షి):
ఉపాధ్యాయుడు సిలివేరు అనిల్ కుమార్ ఆత్మీయ వీడ్కోలు అభినందన సన్మానం మండలంలోని శోభనాద్రిపురం ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. 11 సంవత్సరాలు ఈ పాఠశాలలో ఉపాధ్యాయునిగా సేవలు అందించి ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన అనిల్ కుమార్ ఇటీవల జరిగిన సాధారణ బదిలీలో ఇస్కిళ్ళ ప్రాథమికోన్నత పాఠశాల కు బదిలీ అయిన సందర్భముగా స్థానిక పాఠశాలలో పాఠశాల సిబ్బంది, గ్రామ పంచాయితీ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు మరియు పూర్వ విద్యార్థులు శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందించారు . ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు పి.కళావతి, పంచాయతీ సెక్రటరీ పవన్ కుమార్, గ్రామ సిబ్బంది శ్రీనివాస్, శ్యామ్ కుమార్, అంగన్వాడీ టీచర్లు సరిత , స్వరూపా రాణి, ఆశా కార్యకర్తలు సంతోషి, మాధవి, పూర్వ విద్యార్థి శివ ప్రసాద్, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



## బాసర ట్రిపుల్ ఐటిలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థికి కుటుంబానికి న్యాయం చేయాలి

కొండమల్లేపల్లి, నవంబర్ 13 ( జనంసాక్షి ) :
బాసర ట్రిపుల్ ఐటీ కాలేజీలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని కుటుంబానికి వెంటనే న్యాయం చేయాలని భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం సమావేశం నిర్వహించారు.అనంతరం కార్యదర్శి చేపూరి కార్తీక్ మాట్లాడుతూ బాసర ట్రిపుల్ ఐటీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఒక విద్యార్థిని హాస్టల్ గదిలో ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని పరామర్శకు వెళితే విద్యార్థినికి న్యాయం చేయకుండా న్యాయం కోసం వెళ్లిన ఏబీవీపీ నాయకులను అక్కడున్నా యూనివర్సిటీ అధికారులు ప్రైవేట్ సిబ్బందిని, సెక్యూరిటీలను పెట్టి కనీసం విద్యార్థులని చూడకుండా ఇష్టం వచ్చినట్లు విచక్షణ రహితంగా దాడి చేయడం ఎంతో బాధాకరమని గతంలో కూడా ఒక విద్యార్థిని చనిపోతే ఇలాగే ఏబీవీపీ విద్యార్థి నాయకులపై దాడి చేయించారన్నారు.బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రాణాలు పోతున్నా కనీసం పట్టించుకోకుండా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ బాసర ట్రిపుల్ ఐటీ లో జరుగుతున్న ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యతవహించి విద్యార్థిని కుటుంబానికి వెంటనే న్యాయం చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తుందని తెలిపారు.ఏబీవీపీ విద్యార్థి నాయకులపై దాడి చేసిన సెక్యూరిటీ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేదంటే బాసర ట్రిపుల్ఐటీ విద్యార్థులకు న్యాయం జరిగేంతవరకు ఏబీవీపీ పోరాటం చేస్తూనే ఉంటుందని తెలిపాడు.ఈ కార్యక్రమంలో నగర జాయింట్ సెక్రెటరీ రామ్, కార్తీక్, నగర కార్యవర్గ సభ్యులు కుమార్, కార్తీక్, అర్జున్, నవీన్, మధు, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఆటోవాలాలు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి

కొండమల్లేపల్లి, నవంబర్ 13 ( జనంసాక్షి ) :
ఆటోవాలాలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి హెచ్చరించారు. బుధవారం పట్టణ కేంద్రంలో పరిమితికి మించి పత్తికూలీలను ఆటోలో ఎక్కించుకొని ప్రయాణిస్తున్న ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు అనంతరం వారు మాట్లాడుతూ బుధవారం తెల్లవారు జామున పేర్వాల నుండి చింతపల్లి వైపు ఆటోలో పరిమితికి మించి 20 మంది పత్తి కూలీలను ఆటోలోఎక్కించుకొని నిర్లక్ష్యంగా అజాగ్రత్తగా నడుపుతున్న ఆటో డ్రైవర్ మారం ఆంజనేయులుపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.ఆటో డ్రైవర్లకు ఇతర ట్రావెల్ వాహనాలకు పోలీసు వారి సూచనలు ఏమనగా ఎవరైనా పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలలో ఎక్కించుకుంటే అట్టి వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేయడం



జరుగుతుందన్నారు.ప్రతి ఒక్కరు యూనిఫాం, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండడంతోపాటు వాహన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆటోలో డ్రైవర్ పక్కన, చెక్కలపై, వెనుక వైపు ప్రయాణికులను కూర్చోబెట్టరాదన్నారు. విద్యార్థులను చేరవేసే ఆటోలు ఖచ్చితంగా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు.నిబంధనలు పాటించని డ్రైవర్లపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో వ్యక్తి మృతి



తుంగతుర్తి, నవంబర్ 13, (జనం సాక్షి)
ద్విచక్ర వాహనం పై వెళుతున్న ఓ వ్యక్తిని వెనుక నుండి ప్రమాదవశాత్తు బైక్ తో ఢీ కొట్టడంతో ఓవ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని స్టేడియం వద్ద బుధవారం సంఘటన చోటు చేసుకుంది. మృతుడి బంధువులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని . రామన్నగూడెం గ్రామానికి చెందిన గాజుల రాములు (59) మండల కేంద్రంలోని స్టేడియం వద్ద 365 జాతీయ రహదారిపై తన బైక్‌పై తుంగతుర్తి నుండి మద్దిరాల వైపు వెళ్తుండగా మరో బైక్ ప్రమాదవశాత్తు వెనుక నుంచి బలంగా అతివేగంతో వచ్చి ఢీకొట్టడంతో రాములు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఒక కూతురు కలరు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై క్రాంతికుమార్ తెలిపారు.

## సిపిఐ డివిజన్ కార్యదర్శిగా కల్లూరి



భద్రాచలం, నవంబర్ 13 (జనంసాక్షి)
భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ భద్రాచలం డివిజన్ కార్యదర్శిగా కల్లూరు వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన డివిజన్ స్థాయి సమావేశంలో ఈ ఎన్నిక చోటు చేసుకుంది. గతంలో రెండుసార్లు డివిజన్ కార్యదర్శిగా ఎన్నికైన కల్లూరి పార్టీ కెనలేని సేవలు చేశారు. ప్రస్తుతం ఆయన రాష్ట్ర సమితి సభ్యులుగా, గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నిర్మాణ బాధ్యులుగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా కల్లూరి మాట్లాడుతూ రాష్ట్ర జిల్లా పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా సిపిఐ ని గ్రామ గ్రామాన విస్తరింప చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. తన నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ భాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య, ములుగు జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవికుమార్ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మగౌరవ సభ జయప్రదం చేయండి

పాల్వంచ, నవంబర్ 13 (జనంసాక్షి) :



ఈనెల 15న ఖమ్మంలో జరుగు మాల ఉద్యోగుల విద్యుత్ ఉద్యోగులు, మాల రక్త బంధువుల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని నాయకులు బూరుగుల విజయభాస్కర్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం పాల్వంచ పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం ఓయాసిస్ రిసార్ట్ మమత రోడ్‌లో జరుగు ఈ సభకు అందరూ బాధ్యతతో మాల కుల బంధువులకు సమాచారాన్ని చేరవేసి జయప్రదం చేయాలన్నారు. ఈ వర్గీకరణ వల్ల అన్నదమ్ములుగా కలిసి ఉండే వాళ్ళం విడిపోవలసి వస్తుందని కావున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మేము విన్నవించుకునేది ఏమిటంటే మమ్మల్ని విడకొట్టి పాలించకండి మేమంతా కలిసి ఉంటామని అన్నారు. వర్గీకరణ చేయడం వల్ల ప్రభుత్వాలకు లాభాలు తప్ప మనకు ఎలాంటి మంచి జరగదని అంతా కలిసి ఉంటేనే ఏదైనా సాధించగలుగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, జాతీయ మాల విద్యుత్ ఉప కులాల సంఘ విద్యుత్ సంఘ నాయకులు వై వినేరాజ్ సంపత్, వల్లమల్ల జాకో, దాడ శ్రీనివాస్, రామచందర్, నల్లబల్లి రాంబాబు, తుంపుడు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కూసుమంచిమంత్రిక్యాంప్ ఆఫీసుదగ్గర రెండు బైకులు డీ

పాలేరు.నవంబర్.(13)



జనంసాక్షి : పాలేరు నియోజక వర్గం కూసుమంచి మంత్రి క్యాంప్ ఆఫీసు దగ్గర రెండుబైకులు డి. అందులో మంత్రిగారి క్యాంప్ కార్యాలయంలో పని చేస్తున్న వీరబాబు కుగాయాలు గట్టిగానే తగిలాయని ఇతని స్వస్థలం గోళ్లగూడెం ఇంకో అతనుబోటి మీ తండా వాసి ఇతనికి కూడా గాయాలు గట్టిగానే తగిలాయి అని తెలిసింది పోలీసులు క్షతగాత్రులను చికిత్స కోసం ప్రభుత్వ దవాఖానకు తరలించి కేసును దర్యాప్తు చేస్తున్నారు.



# 40 లక్షలతో నిర్మించే కళ్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన

నేరేడుచర్ల నవంబర్ 13(జనంసాక్షి) నేరేడుచర్ల లోని తహసిల్దార్ కార్యాలయం సమీపంలో ఇటీవల దాతల సహకారంతో నిర్మించిన శ్రీ కోదండ రామాలయం ఆవరణలో సుమారు 40 లక్షలతో నిర్మించనున్న కళ్యాణ మండప నిర్మాణానికి బుధవారం సాంప్రదాయ సిద్ధంగా శంకుస్థాపన పూజా కార్యక్రమాలు నిర్వహించారు, ఆలయ నిర్మాణానికి స్థానిక రాచకొండ రామచంద్రరావు కుటుంబ సభ్యులు 18 కుంటల స్థలాన్ని విరాళంగా ఇవ్వగా నిర్మించారు, కళ్యాణ మండపం నిర్మాణానికి ప్రముఖ బిల్డర్ మిర్యాల ప్రసాద్ శోభ దంపతులు 20 లక్షల రూపాయలు విరాళంగా ఇవ్వగా నేడు వేద పండితులు మొలుగు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రాలతో సాంప్రదా సిద్ధంగా వైభవంగా శంకుస్థాపనపూజా కార్యక్రమాలను చేశారు, ఈ కార్యక్రమం లో ఆలయ శాశ్వత ధర్మకర్త రాచకొండ రామచంద్రరావు, ఆలయకమిటీ చైర్మన్ కొణతం సత్యనారాయణ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు రాచకొండ నాగ మాధవరావు,ఉప్పల కృపాకర్ ,పులిజాల వెంకటరమణారావు, రాగిరెడ్డి గోపాల్ రెడ్డి, యడవల్లి వెంకట్ రెడ్డి, గొల్ల సుధాకర్, మురారి శెట్టి రమేష్, దొంతి రెడ్డి వెంకటరమణారెడ్డి, నిమ్మగడ్డ సుబ్బారావు, జెట్టి వెంకన్న, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొణతం చిన్న వెంకటరెడ్డి, ఎస్ఐ రవీందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, కౌన్సిలర్ వేమూరి నారాయణ నాగవేణి, చెరువు సంఘం చైర్మన్ యామిని వీరయ్య, అయ్యప్ప దేవాలయ కమిటీ ధర్మకర్త కొణతం కృష్ణారెడ్డి,పానుగోటి జంగారావు, శ్రీవాణి స్కూల్ డైరెక్టర్ కొణతం సీతారాం రెడ్డి, భువనగిరి అంజయ్య,రాచకొండ శ్రీనివాసరావు, కుంకు చిన్నయ్య, సైదిరెడ్డి, యర్రంశెట్టి జానయ్య, ముచ్చర్ల నరసింహారావు, కొణతం నారాయణరెడ్డి, ధూళిపాల ధనంజయ నాయుడు, ఆకారపు వెంకటేశ్వర్లు, మరు శ్రీనివాసరావు, చిత్తనూరి రామకృష్ణ, టి శ్రీరామ్ రెడ్డి, టి నర్సిరెడ్డి, కొనతం చిన్న లచ్చిరెడ్డి, కందిబండ శ్రీనివాసరావు, కట్ట రంగారెడ్డి, కొనటం చిన్న సీతారాం రెడ్డి, కుంకు మోహన్ రావు, కట్ట గణేష్ రెడ్డి, మల్లారెడ్డి, అలక సైదిరెడ్డి, వీరమల సత్యనారాయణ, అనంతల సత్యనారాయణ, వెంకట్ రెడ్డి, రాగిరెడ్డి రేవతి, నిమ్మగడ్డ అన్నపూర్ణ, వనజ, పూలమ్మ, రంగనాయకమ్మ, రూప, సంధ్య, జ్యోతి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఆర్ఎం పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవం

కోదాడ,జనంసాక్షి:
నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు అని ఎస్ఆర్ఎం పాఠశాల కరస్పాండెంట్ కేశినేని శ్రీదేవి అన్నారు. బుధవారం బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు అలరించారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు తమ పాఠశాలలో విద్యతోపాటు చిన్ననాటి నుండి సామాజిక సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అన్ని రంగాల్లో రాణించేందుకు తమ పాఠశాలలో సరైన వాతావరణం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా రంగురంగు చీరలతో విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దొంగలను.. పట్టుకున్న పోలీసులు

◆ చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు ◆ నేరస్తులను రిమాండ్ చేసి,జైలుకు తరలించిన పోలీసులు



పి.ఏ.పల్లి నవంబర్ 13 (జనంసాక్షి) :
పి.ఏ.పల్లి మండలంలో గత కొన్ని సంవత్సరాలుగా దొంగతనాలు చేస్తూ పోలీసులకు సవాలుగా మారిన దొంగలను పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి బుధవారం నాడు వారిని పట్టుకున్నారు. గుడిపల్లి ఎస్ఐ నరసింహులు తెలిపిన వివరాల ప్రకారం తంగిళ్ళ గంగాధరచారి తండ్రి బ్రహ్మచారి,మోటమర్రి ఆంజనేయులు తండ్రి మల్లయ్య అంగడిపేట గ్రామస్తులు. గతంలో పి.ఏ.పల్లి గ్రామంలో వంగాల లక్ష్మారెడ్డి ఇంటిలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపులను పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉంచిన ఐదు తులాల బంగారం మరియు ఐదు లక్షల రూపాయలు అపహరించారని ఫిర్యాదు పై అప్పట్లో గుడిపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడమైనది. పెట్టిన కేసు విచారణ అధికారిగా వచ్చినటువంటి కొండమల్లేపల్లి సిఐ ధనంజయ మరియు గుడిపల్లి ఎస్సై నర్సింహులు ఇట్టి కేసు దర్యాప్తులో భాగంగా నమ్మదగిన సమాచారం పై నేరస్తుల గురించి గాలింపు చర్యలు చేపడుతున్న క్రమంలో ఈరోజు అనగా 13 నవంబర్ బుధవారం రోజు ఉదయం అంగడిపేటకు ఎర్టిగా కారులో వస్తున్నారు. అన్న సమాచారంతో వెతుకుతుండగా అంగడిపేట ఎక్స్ రోడ్ వద్ద ఎర్టిగా కారు నెంబర్ %ూ 19 దీ% 2626 గలదాన్ని ఆపి అందులో ఉన్న నేరస్తులను విచారించగా వారు పి.ఏ.పల్లి లో చేసిన నేరంతో పాటు వారం రోజుల క్రితం అంగడిపేట లోని రాజు ఇంటిలో 92,000 మరియు కొండమల్లేపల్లి మండలంలో ఒక ఎలక్ట్రికల్ షాపులో దొంగిలించిన మోటార్ల దొంగతనాలను ఒప్పుకున్నారు. జల్సాలకి అలవాటు పడి కష్టపడకుండా డబ్బులు సంపాదించాలని ఉద్దేశంతో దొంగతనాలు చేస్తున్నట్టు వారు ఒప్పుకున్నారు. వారి దగ్గర నుంచి పి.ఏ.పల్లి దొంగతనంలో చంద్రహారాన్ని మరియు అంగడిపేటలో దొంగతనంలో 45 వేల రూపాయలను మరియు మల్లెపల్లి మండలంలో దొంగతనం చేసిన కూలర్ మోటర్లు మరియు వడ్రంగి సామాగ్రిని మరియు ఇట్టి దొంగతనానికి ఉపయోగించిన ఎర్టిగా కారును మరియు వారి ఇద్దరి నుండి సెల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. మొత్తం రికవరీ చేసిన సొత్తు సుమారుగా ఆరు లక్షల విలువ కలిగి ఉంటుంది అని, దొంగలను ఛేదించడంలో పనిచేసిన సిబ్బంది అయినటువంటి సిఐ ధనుంజయ,ఎస్ఐ నరసింహులు, సిబ్బంది శ్రీధర్ రెడ్డి,హేము నాయక్,భాస్కర్, గురువారెడ్డి,లింగయ్య,రవి లను దేవరకొండ డిఎస్పి గిరిబాబు వారిని అభినందించినారు.

# సీపీఐది వందేళ్ళ పోరాట చరిత్ర


## సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు




సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):
సీపీఐ ఏర్పడి 100 సంవత్సరాలు నిండుతున్న సందర్భంగా శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ధర్మబిక్షం భవనంలో పట్టణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సమితి పిలుపులో భాగంగా సంవత్సరం కాలం పాటు పల్లె పల్లెన ఎర్రజెండా ఎగరవేసి కమ్యూనిస్టు పార్టీ పోరాట చరిత్రను భావితరాలకు తెలిసే విధంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. బ్రిటిష్ సామ్రాజవాదులను ఈ దేశం నుండి తరిమేసేందుకు సాగిన స్వాతంత్ర్య సమరశీల పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ విశేష త్యాగాలను చేసిందని, నిజాం నిరంకుశ పాలనకు అంత మొందించేందుకు సమరశీల పోరాటాలు సిపిఐ చేసిందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని నడిపించి 4 వేల గ్రామాలకు విముక్తుల్ని చేసి పది లక్షల ఎకరాలు భూములను చర నుండి విడిపించి పేదలకు పంచిన ఘనత భారత కమ్యూనిస్టు పార్టీదని కొనియాడారు. 2025 సభ్యత్వం చేర్పింపు, పునరుద్ధరణ లక్ష్యాలను పూర్తి చేసి గ్రామ,మండల స్థాయి, ప్రజా సంఘాల మహాసభలను పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని కోరారు. డిసెంబర్ 30న నల్లగొండలో జరిగే శత జయంతి ఉత్సవాల బహిరంగ సభకు సూర్యాపేట జిల్లా నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. గుగులోతు రాజారామ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, పార్టీ సీనియర్ నాయకులు బొమ్మగాని శ్రీనివాస్, చివ్వెంల మండల పార్టీ కార్యదర్శి ఖమ్మంపాటి రాము, పట్టణ కౌన్సిల్ సభ్యులు నిమ్మల ప్రభాకర్, రేగటి లింగయ్య, ఎడెల్లి శ్రీకాంత్, బూర సైదులు,పెంద్రా కృష్ణ, గాలి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర కుటుంబ సర్వే కి ప్రజలంతా సహకరించాలి..

## ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి



నిడమనూరు (జనం సాక్షి)
సమగ్ర కుటుంబ సర్వే పై ప్రజలంతా ఎటువంటి అప నమ్మకాలు పెట్టుకోకుండా సర్వే అధికారులకు సహకరించాలని ఆయన ప్రజలను కోరారు. బుధవారం మండలంలోని రాజన్న గూడెం లో ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వేను నిర్వహిస్తున్న అధికారులకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జంగాల కృష్ణయ్య, నడుమునూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అంకత సత్యం, నాయకులు ముంగి శివ మారయ్య, కొండ శ్రీనివాస్ రెడ్డి, నందికొండ మట్టారెడ్డి,బొల్లం శ్రీనివాస్ యాదవ్, అంకతి వెంకటరమణ, నర్సింగ్ విజయ్, ఉన్నం చిన్న వీరయ్య, మేరెడ్డి వెంకటరమణ, పోల రవి, పగిళ్ల శివ, అల్లంపల్లి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చట్టాలను తెలుసుకోవాలి




**కోదాడ,జనంసాక్షి:**
విద్యార్థి దశలోనే విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకొని సమాజంలో నేర ప్రవృత్తిని తగ్గించేందుకు కృషి చేయాలని కోదాడ సీనియర్ సివిల్ జడ్జి,మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కే.సురేష్ అన్నారు.బాలల దినోత్సవం సందర్భంగా బుధవారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాల కార్మిక చట్టం,విద్యా హక్కు చట్టం,యితర చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు.విద్యార్థులు చట్టాలు,న్యాయ సూత్రాల తెలుసుకొని భవిష్యత్తు లో మంచి పౌరులుగా తయారుకావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు దుర్వసనాల బారిన పడకుండా చదువు పై దృష్టి పెట్టి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్య క్షుడు గట్ల నరసింహా రావు,ప్రధాన కార్యదర్శి చింతకుంట్ల రామిరెడ్డి, ఎంఈవో సలీం షరీఫ్, న్యాయవాదులు మంద వెంకటేశ్వర్లు,సెగ్గెం వెంకటాచలం, దొడ్డ శ్రీధర్,తాటి మురళీ, హేమలత, బండి వీరభద్రమ్,ఆవుల మల్లి కార్జున రావు,సుల్తాన్ నాగరాజు, పాఠశాల ఉపాధ్యాయులు మార్కం డేయ, బడుగుల సైదులు తదితరులు పాల్గొన్నారు.



# మందకోడిగా వరి ధాన్యం కొనుగోలు

- మండల కేంద్రంలో బిపిటి సెంటర్ ఏర్పాటు చేయాలని రైతుల డిమాండ్
- తేమశాతం సాకుతో రైతులను ఇబ్బంది పెడుతున్న వ్యవసాయ శాఖ అధికారులు

పి.ఏ.పల్లి నవంబర్ 13 (జనంసాక్షి):
పి.ఏ.పల్లి మండలంలో తెలంగాణ ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.అన్ని ఉన్నా అల్లుని నోట్లో శని ఉన్నట్లు ప్రస్తుతం మండల కేంద్రంలో రైతుల పరిస్థితి అదే విధంగా ఉంది.పి.ఏ.పల్లి మండల కేంద్రంలో స్థానిక సబ్ మార్కెట్ యార్డ్ యందు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.కానీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై దగ్గర దగ్గర నెల రోజులు కావస్తున్నా కూడా రైతుల ధాన్యంను తేమ సాకుతో కొనుగోలు చేయకుండా వ్యవసాయ శాఖ అధికారులు రైతులను తీవ్ర ఇబ్బంది పెడుతున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. పి.ఏ.పల్లి మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి చుట్టుపక్కల ఉన్న గ్రామాల రైతులు అందరూ బిపిటి ,1010 ధాన్యాలు తీసుకొని కొనుగోలు కేంద్రానికి వస్తారు కానీ కేవలం 1010 ధాన్యాలను మాత్రమే కొనుగోలు చేస్తున్నారని,బిపిటి ధాన్యం పండించిన రైతులను అంగడిపేట సెంటర్కు పోవాలని అధికారులు ఉచిత సలహా ఇస్తున్నారని,పి.ఏ.పల్లి కొనుగోలు కేంద్రంలో బీపీటి దాన్యం కొనుగోలు చేయాలని అధికారులను రైతులు డిమాండ్ చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు,ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని పీ.ఏ.పల్లి మండల కేంద్రంలో బిపిటి ధాన్యం కొనుగోలు సెంటర్ ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# న్యాయవాదుల పై దాడులను అరికట్టాలి



కోదాడ, జనంసాక్షి: దేశంలో, రాష్ట్రంలో రోజురోజుకు న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ ఆర్ కే మూర్తి డిమాండ్ చేశారు.హైదారాబాద్ లో అడ్వకేట్ పై కత్తులతో దాడి చేసిన సంఘటనకు నిరసనగా బుధవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోదాడ కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు.ఈ కార్యక్రమాలలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులు పెరుగుతున్న ప్రభుత్వాలు మాత్రం వారి రక్షణకు చర్యలు తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేసారు.న్యాయవాదుల రక్షణకు సమగ్ర చట్టం రూపొందించి,దానిని అమలు చేయాలని, దాడులకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గట్ల నరసింహారావు,ప్రధాన కార్యదర్శి చింతకుంట్ల రామిరెడ్డి,కార్యవర్గం కోదూరు వెంకటేశ్వర రావు,హేమలత,దొడ్డ శ్రీధర్,పలువురు సీనియర్,జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ నేత హరీష్ రావును కలిసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి..

గుర్రంపోడు మండలం నవంబర్: 13 (జనంసాక్షి)
దేశిడి సురేందర్ రెడ్డి- శ్రీలత దంపతుల కుమారుడు భరత సింహారెడ్డి- మనీషా ల వివాహ మహోత్సవం బుధవారం హైదరాబాదు తుర్కయంజాల్ లోని పరిణయ కన్వెన్షన్ హాల్ నందు జరిగినది.ఈ వివాహ వేడుకకు హాజరైన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీష్ రావు,ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డిలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి కలిసి గుర్రంపోడు మండల బీఆర్ఎస్ పార్టీ కార్యకలాపాలను కార్యాచరణ గురించి వివరించి గుర్రంపోడు మండలంలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలియజేశారు.



# పైళ్ల శేఖర్ రెడ్డికి ఫోన్ టాపింగ్ కేసులో నోటీసు ఇవ్వడం అవాస్తవం

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో నవంబర్ 13 (జనం సాక్షి) :
భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డికి ఫోన్ టాపింగ్ కేసులో నోటీసు ఇచ్చినట్లు బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తలో ఎలాంటి వాస్తవం లేదని బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏ వి కిరణ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు జనగాం పాండులు తెలిపారు. బుధవారం బిఆర్ఎస్ పార్టీ కార్యలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డికి ఎలాంటి నోటీసు రాలేదని ఇంటలిజెన్స్ అదనపు ఎస్పీ తిరుపతన్నతో ఫోన్ మాట్లాడి ఫోన్ ట్రైపింగ్ చేశారని అబద్దపు ప్రచారాన్ని కొంతమంది కాంగ్రెస్ నాయకులు కావాలని కుట్రతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల హామీల్లో భాగంగా 6 గ్యారంటీలను చేయనందున ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించడానికి ఈ విధమైన కుట్రకు తెర లేపడం జరిగిందన్నారు. పైళ్ళ శేఖర్ రెడ్డి గురించి భువనగిరి ప్రజలందరికీ తెలుసు అతను ఎమ్మెల్యేగా ఉన్న పది సంవత్సరాలు అభివృద్ధి పై నిరంతరం కృషి చేయడం జరిగిందని ఎలాంటి అవినీతి ఆరోపణలు లేని తెల్ల కాగితం లాంటి వారని అలాంటి శేఖర్ రెడ్డి పైన కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తే రానున్న రోజుల్లో టిఆర్ఎస్ పార్టీ నాయకులతో పాటు ప్రజలు మీ మీద తిరుగుబాటు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, బిఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా నాయకులు బబ్లు, ర్యాకల శ్రీనివాస్, రహీం, మహేశ్, సైదులు పాల్గొన్నారు.

# రామన్నపేట ఆసుపత్రి సూపరింటెండెంట్ గా డాక్టర్ ఈశ్వర్



రామన్నపేట, నవంబర్ 13 (జనంసాక్షి):
రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ గా డాక్టర్ టి. ఈశ్వర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ బి. వీరన్న ఆరోగ్య కారణాల రీత్యా తమ బాధ్యతలను ఆసుపత్రిలో సీనియర్ డాక్టర్ గా పనిచేస్తున్న సివిల్ సర్జన్ డాక్టర్ ఈశ్వర్కు పూర్తి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఈశ్వర్ మాట్లాడుతూ ... ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని తెలిపారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన ఆర్డీఓ




ఆత్మకూర్ ఎస్ జనంసాక్షి :
మండల పరిధిలోని తుమ్మల పెన్ పహాడ్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆర్డీవో వేణుమాధవరావు తనిఖీ చేశారు. కాంటాలను పరిశీలించి తూకం కరెక్ట్ వేస్తున్నారా లేదా అని రైతులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ట్యాబ్ ఎంట్రీ వివరాలు, రైతు రిజిస్టర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అలాగే ధాన్యం నింపడానికి అవసరమైన గోనె సంచులను ముందే తెచ్చుకోవాలని సూచించారు. ధాన్యం తూకంలో తేడా లేకుండా కచ్చితత్వం పాటించాలన్నారు. రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకుండా ఐకెపి సెంటర్ కు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ హరిచంద్ర ప్రసాద్, ఏపీఎం మంజుల, ఆర్ఐ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

**పెండింగ్ ఫైల్స్ పరిశీలన**

అనంతరం తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ధరణి పెండింగ్ ఫైల్స్ పై ఎమ్మార్వో, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పెండింగ్ ఫైల్స్ లో ఎలాంటి సమస్యలు ఉన్న త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

జనంసాక్షి

# షీ టీమ్స్ సైబర్ నేరాలపై అవగాహన

సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):
ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ మేక నాగేశ్వరరావు ఆధ్వర్యంలో, సూర్యాపేట షీ టీం మహిళా ఎస్ఐ నీలిమ పట్టణంలోని సాయిగౌతమి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు షీ టీమ్స్ , సైబర్ నేరాలు, గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ నీలిమ మాట్లాడుతూ జిల్లా ఎస్పి సన్ ప్రీత్ సింగ్ అధ్వర్యంలో షీ టీమ్స్, సైబర్ నేరాలపై, గంజాయి డ్రగ్స్ మత్తు మందులు, గుట్కాపై పటిష్టంగా పనిచేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు,యువత ఇంటర్నెట్ ను సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ మోసగాళ్ల మోసాలకు గురి కాకుండా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.బ్యాంక్ ఖాతా, ఏటీఎం కార్డ్, ఓటిపి వివరాలు ఇతరులకు తెలుపవద్దన్నారు.ఇతరులు ఆశ చూపితే వాటికి ఆకర్షితులు కావద్దని,మెసేజ్ లలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దని సూచించారు.సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్ కు పిర్యాదు చేయాలని అన్నారు.వేధింపులపై 100కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్ నెంబర్లు, సోషల్ మీడియాలో బహిర్గతం చేయవద్దన్నారు. వ్యక్తిగత ఫోటోలను డీపీలుగా పెట్టుకోవద్దని చెప్పారు.మొబైల్ యాప్ లలో వచ్చేటువంటి అనవసరమైన బ్లూ లింకులను క్లిక్ చేయవద్దని తెలిపారు.యువత చెడు వ్యసనాల బారిన పడొద్దని అన్నారు.గంజాయి, మత్తుమందులకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే తప్పకుండా పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని కోరారు.యువత లోన్ యాప్ లకు దూరంగా



ఉండాలన్నారు.సామాజిక మాధ్యమాలకు రక్షణగా బలమైన పాస్ వర్డ్ పెట్టుకోవాలని అన్నారు.మహిళల రక్షణపై పటిష్టంగా పనిచేస్తున్నామని, ఆకతాయిలా ఆటలు సాగవని, మహిళలను ఆడపిల్లలను గౌరవించాలన్నారు. ఆత్మ రక్షణ కొరకు మెలుకువలు నేర్చుకోవాలన్నారు.ఎవరైనా ఆత్మగౌరవాన్ని భంగపరిచినట్లయితే షీ టీం నెంబర్ 8712686056 కు సమాచార తెలియజేయవచ్చని అన్నారు.టీ సేఫ్ యాప్ గురించి విద్యార్థినిలకు వివరించారు.ఈ కార్యక్రమంలో షీ టీమ్స్ ఏఎస్ఐ సాలయ్య, కళాశాల ప్రిన్సిపల్ యరగాని లక్ష్మయ్య, మహిళా సాధికారత కేంద్రం నుంచి రేవతి, వినోద్, తేజస్విని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## ఐకెపి సెంటర్ ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి..

### పిఎసిఎస్ ఛైర్మన్ వెలిశెట్టి రామకృష్ణ..

మిర్యాలగూడ నవంబర్ 13(జనంసాక్షి)
మిర్యాలగూడ మండలంలోని అవంతిపురం మార్కెట్ యార్డ్ నందు గల ఐకెపి సెంటర్ ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆలగడప పి ఎస్ సి ఎస్ ఛైర్మన్ వెలిశెట్టి రామకృష్ణ అన్నారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఎన్నో వ్యయ ప్రయాసలు ఎదుర్కొని ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని మిల్లుల వద్ద ఇబ్బంది పడుతూ మిల్లుల వారు నిర్ణయించిన ధరకు అమ్మ వద్దని ఐకెపి సెంటర్ ద్వారా అమ్మినట్లయితే ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర 2320 తోపాటు బోనస్ 500 రూపాయలు కలుపుకొని మొత్తంగా రైతు 2820 రూపాయలు తీసుకోవడం ద్వారా రైతులకు లబ్ధి చేకూరుతుందని కావున ఐకెపి సెంటర్ ద్వారా మాత్రమే విక్రయించాలని కోరారు. వారి వెంట మార్కెట్ సెక్రటరీ రఘునందన్ రెడ్డి, సీఈవో యాదగిరి, లక్ష్మయ్య, ఏఈఓ అఫ్రీన్, మార్కెట్ సూపర్వైజర్ అరుణ్, రైతులు పాల్గొన్నారు.



## రైతులు ఐకెపి సెంటర్ సద్వినియోగం చేసుకోవాలి

### - పిఎసిఎస్ ఛైర్మన్ వెలిశెట్టి రామకృష్ణ

మిర్యాలగూడ, నవంబర్ 13 (జనం సాక్షి):
మిర్యాలగూడ మండలంలోని అవంతిపురం మార్కెట్ యార్డులో ఉన్న ఐకెపి సెంటర్ ద్వారా రైతులు తమ ధాన్యం విక్రయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిఎసిఎస్ ఛైర్మన్ వెలిశెట్టి రామకృష్ణ అన్నారు. ఆయన రైతులకు మద్దతు ధరపై వివరాలు తెలియజేస్తూ, మిల్లుల వద్ద ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మాత్రమే విక్రయించాలని సూచించారు. రైతులు తమ ధాన్యాన్ని ఐకెపి సెంటర్ ద్వారా అమ్మినట్లయితే, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ. 2,320కు అదనంగా రూ. 500 బోనస్‌తో కలిపి మొత్తం రూ. 2,820 పొందవచ్చని చెప్పారు. దీంతో రైతులకు మంచి లాభం చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ సెక్రటరీ రఘునందన్ రెడ్డి, సీఈవో యాదగిరి, లక్ష్మయ్య, ఏఈఓ అఫ్రీన్, మార్కెట్ సూపర్వైజర్ అరుణ్, మరియు పలువురు రైతులు పాల్గొన్నారు.



## ఘనంగా కాళోజి నారాయణరావు వర్ధంతి

నేరేడుచర్ల నవంబర్ 13 (జనంసాక్షి)న్యూస్ :
కాళోజి నారాయణరావు వర్ధంతిని బుధవారం పట్టణంలోని ప్రధాన కూడలిలో బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనంజయ నాయుడు, బీసీ,యసి,ఎస్టి, మైనారిటీ ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి రాపోలు నవీన్ కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను ఆధ్వర్యంలో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసిన ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిజాం నిరంకుశత్వానికి, దొరల దమన నీతికి వ్యతిరేకంగా కలం ఎత్తిన గొప్ప యోధుడు కాళోజి అని అన్నారు.సమాజంలో అన్యాయాన్ని ఎదిరించే వాడే నాకు ఆరాధ్యుడు అని ఆయన ప్రకటించారు. కాళోజి ఉద్యమమే ఊపిరిగా కడదాకా జీవించిన దీశాలి అని, పుట్టుక నీది చావు నీది మిగిలినదంతా దేశానిది అని అన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు కొమ్రరాజు వెంకట్, పరికే భరత్, నాయకులు పాల్వాయి నాగయ్య, ఎస్కే రజాక్, రాజు,సందీప్, సైదులు, వసంత్,నిఖిల్ చక్రవర్తి, జయంత్, సాయి కృష్ణ, రాహుల్, అకిరానందన్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతు ఆవేదన



హుజూర్ నగర్, నవంబర్ 13 (జనంసాక్షి):
మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. హుజూర్ నగర్ పట్టణంలోని పొట్టి శ్రీరాములు సెంటర్ లో బుధవారం ఐల సైదులు అనే రైతు తమ ధాన్యం కొనుగోలు చేయడం లేదని రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్ పై తెచ్చిన ధాన్యం లోడు పెట్టి నిరసన వ్యక్తం చేశాడు. గత మూడు రోజుల నుండి రైస్ మిల్లర్ల చుట్టూ తిరుగుతున్నప్పటికీ తమ ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్ఐ ముత్తయ్య, రెవెన్యూ అధికారులు, రైతు వద్దకు వచ్చి అతనికి సర్ది చెప్పి మార్కెట్ యార్డులో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఆయన ధాన్యాన్ని తరలించారు.

## గర్భిణీలు, బాలింతలు పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలి

### ఐసీఐడిఎస్ సూపెర్వైజర్ నాగమణి

మాడ్గులపల్లి, నవంబర్ 13 (జనంసాక్షి): ఐసీఐడిఎస్ దామరచర్ల ప్రాజె క్టు మాడ్గులపల్లి మండలం



కల్వలపాలెం గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో బుధ వారం పోషణఅభియాన్ కార్యక్రమం. నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చిట్యాల.మమత– సైదులు దంపతుల కుమార్తె వేదశ్రీ కిఅన్నప్రాసనకార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా అంగన్వాడీ సూపర్వైజర్ జే నాగమణి మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు పిల్లలు ప్రతిరోజూపోషకా హారంతీసుకోవాలన్నారు. చిరుధాన్యాలు ఆకు కూరలు పండ్లు పప్పులు నువ్వులు బెల్లం పాలు గుడ్డు నిత్యం ఆహారంలో ఉండెలా జాగ్రత్త తీసుకోని అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. పరిసరాల పరిశుభ్రత తో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి సీజనల్ వ్యాధులను అరికట్టి అంటురోగాలను నిరోధించిఆరోగ్యంగా ఉండాల నికోరారు .ఈకార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు నాగయ్య, ఉపాధ్యాయు రాలు సరిత, అంగన్వాడీ టీచర్ , లెంకల కల్పన, ఆయా నవ్య, చిన్నారు లు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి

కోదాడ,జనంసాక్షి:
రైతుల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని కోదాడ శాసనసభ్యులు పద్మావతి రెడ్డి అన్నారు.బుధవారం అనంతగిరి మండలంలోని అమీనాబాద్,త్రిపురవరం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ త్వరలోనే రైతు భరోసా నిధులు అందజేసి అన్నదాతలకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు.ప్రభుత్వం నిబంధనల మేరకు రైతులు ధాన్యాన్ని,ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు.కేంద్రాల్లో ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్ రెడ్డి,చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి,బుర్ర పుల్లారెడ్డి,దేగ కొండయ్య,గుర్రం వెంకటరెడ్డి,బాబు నాయక్, ముత్తినేని కోటేశ్వరరావు,వివిధ శాఖల అధికారులు, నాయకులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# మిర్యాలగూడలో జరిగే సిపిఎం బహిరంగ సభను జయప్రదం చేయండి

## సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో కరపత్రము విడుదల

మిర్రిగూడ, నవంబర్ 13,( జనంసాక్షి)
మిర్యాలగూడలో జరిగే సిపిఎం బహిరంగ సభను జయప్రదం చేయండి. డిసెంబర్ 2.3.4 తేదీలలో జరిగే నల్లగొండ జిల్లా 21వ మహాసభలు జయప్రదం చేయాలని మర్రిగూడ మండల కేంద్రంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో కరపత్రము విడుదల చేయడం జరిగింది, సిపిఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు పారిశ్రామిక రంగాన్ని వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా దివాలా తీయించిందని అన్నారు, ప్రభుత్వాలతో పోరాడి సాధించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అంబానీ



ఆదాన్ని ఇలాంటి బడా కార్పొరేట్ సంస్థలకు కారు చౌకగా అమ్మేస్తుందని అన్నారు, నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేసే శ్రీశైలం సొరంగ మార్గం డిండి ఎత్తిపోతల పథకాలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు, ప్రభుత్వ శాఖల్లో వివిధ రంగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఉద్యోగ జాబ్ క్యాలెండర్ను ఏర్పాటు చేయాలని కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కొట్టం యాదయ్య చెల్లం, ముత్యాలు, గడగూటి వెంకన్న ,సల్వోజు రామలింగాచారి ,నామ సైదులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్-3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

## సూర్యాపేటలో మొత్తం 30 సెంటర్ల ఏర్పాటు

## హాజరు కానున్న 8951మంది అభ్యర్థులు

## అదనపు ఎస్పీ నాగేశ్వరరావు



సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):
టీజీపీఎస్సీ గ్రూప్ -3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు ఎస్పీ నాగేశ్వరరావు అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, రూట్ ఆఫీసర్లకు రీజనల్ కో ఆర్డినేటర్ ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ డాక్టర్ వెంకటేశులుతో కలిసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17 ,18వ తేదీలలో నిర్వహించే గ్రూప్-3 పరీక్షకు సూర్యాపేటలో మొత్తం 30 పరీక్ష కేంద్రాల ఏర్పాటు, 8951 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు.పరీక్ష కేంద్రానికి అనుమతించేటప్పుడు విద్యార్థుల హాల్ టికెట్, ఏదైనా గుర్తింపు కార్డును తనిఖీ చేసి పంపాలని పేర్కొన్నారు .మొత్తం 68 బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లను అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ప్రతి అభ్యర్థి బయోమెట్రిక్ తీసుకోవాలని సూచించారు.ప్రతి కేంద్రంలో ఫర్నిచర్ ,త్రాగునీరు మెడికల్ కిట్ అభ్యర్థులకు అందుబాటులో ఉంచాలని అన్నారు.ఎలక్ట్రానిక్స్ వస్తువులకు అనుమతి లేదన్నారు.పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

# అర్ధరాత్రి అరెస్టు చేసిన గిరిజన రైతులను విడుదల చేయాలి

**లంబాడి రైతుల భూములను తీసుకోవడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం**

**ఈ ప్రాంతం నుండి ఫార్మా కంపెనీలను వెనక్కి తీసుకోవాలి**

**సక్రు నాయక్ రమావత్**

**తెలంగాణ లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్**

నల్లగొండ రూరల్,నవంబర్13,(జనం సాక్షి)
వికారాబాద్ జిల్లా,కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని దుద్యాల మండలం లగచర్ల,రోటి బండ తండా,పులిచెర్లకుంట తండా,గడ్డమీది తండా,మైసమ్మ గడ్డ తండా,ఈదుల కుంట తండా,హకీంపేట,పోలేపల్లి,ఈదులపల్లి పలు గ్రామాలకు సంబంధించిన రైతుల భూములను ఫార్మా కంపెనీల పేరుతో లాక్కునేందుకు జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో జిల్లా కలెక్టర్,జాయింట్ కలెక్టర్,స్థానిక తహసీల్దార్ లతో జరిగిన సమావేశంలో అధికారులపై జరిగిన దాడిని లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తూనే ఈ దాడికి గల కారణాలను చూస్తే కావాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాంతానికి సంబంధించిన రైతులు,(లంబాడీ )గిరిజనలు మా పొట్ట కొట్టా వద్దు మా భూములు మాకే కావాలి..! మా భూములు లాక్కోవద్దు..! అని ఎన్నిసార్లు ప్రాధేయపడిన కూడా డ్రోన్ కెమెరాలతో సర్వేలు చేస్తూ వేరే గ్రామాలకు సంబంధించిన ప్రజలను తీసుకొచ్చి ప్రజాభిప్రాయ సేకరణ పేరుమీద మా భూములను లాక్కోవాలని ప్రయత్నం చేస్తున్నారని అక్కడి



రైతులు అగ్రహించి అధికారులపై జరిగిన దాడి ఈ దాడి ప్రభుత్వ వైఫల్యమే ఈ దాడికి ప్రభుత్వమే బాధ్యత వహించాలనీ లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది.ప్రజ అభిప్రాయం పేరుతో ఫార్మా కంపెనీల కోసం,మా భూములు మీకు ఇవ్వం,వేలాదిమంది లంబాడీలను రోడ్డుపాలు చేయకండని కొరారు.పచ్చని పొలాలల పై దాడులు చేస్తారా..? మా భూములు మాకే కావాలి,ఈ ఫార్మా కంపెనీలు మాకు వద్దు, రైతులను అర్ధరాత్రి అరెస్టులు చేస్తారా అని ప్రశ్నించారు.ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేసి పచ్చని పొలాలను వల్లకాటుగా చేయవద్దని, ఇదేనా ఇదేనా రైతు సంక్షేమ పాలన,లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ హెచ్చరిస్తుంది. అధికారులపై దాడులు చేశారని పేరు మీద 40 మందికి పైగా రైతులను గిరిజన యువకులను ముక్కుమూడిగా అర్ధరాత్రి అరెస్టు చేశారని, ఈ అరెస్టును ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నదని,అరెస్టు చేసిన వారిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని కోరారు.ఇదే నేపంతో అక్కడి రైతుల భూములను రేవంత్ రెడ్డి ప్రభుత్వం లాక్కోవాలని కుట్ర చేస్తున్నదన్నారు.ఈ కుట్రను తీవ్రంగా ఖండిస్తూనే ఈ ఫార్మా కంపెనీ ఈ ప్రాంతం నుండి వెనక్కి తీసుకోవాలని లేని ఎడల రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని నిర్మిస్తామని లంబాడి హక్కుల పోరాట సమితి, జిల్లా కమిటీల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# వరి పొలాన్ని పరిశీలిస్తున్న శిక్షణ విద్యార్థులు

పెన్ పహాడ్ నవంబర్ 13 (జనం సాక్షి):
గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ శిక్షణ పొందుతున్న మల్లారెడ్డి యూనివర్శిటీలో బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతున్న విద్యార్థినిలు గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా బుధవారం కృషి విజ్ఞాన కేంద్రం కెవికె రావేప్ కోఆర్డినేటర్ ఎ.నరేష్ తో పాటు మండలంలోని దూపహాడ్ గ్రామంలోని వరి పొలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వరి పోలంలో ఉన్న వివిధ పురుగులు మరియు తెగుళు ళ్ళ కలిగించే నష్టాన్ని మరియు నిర్మూలించే యాజమాన్య పద్ధతులగురించి అవగాహన కల్పించారు. ఈ విద్యార్థులు మూడు నెలల పాటు గ్రామాల్లో ఉంటు గ్రామీణ స్థితిగతులు, రైతులు సాగులో అనుసరిస్తున్న పద్ధతులు నూతన సాగు విధానం మరియు ఎదుర్కుంటున్న సమస్యలు సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలను అధ్యనం చేస్తున్నారని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినిలు సి.హెచ్ విశ్వర్య, కె.అక్షయ, మం.అక్షిత, వి.అమూల్య, ఎల్. భావణ, కె.భవాని, కె. భవ్య, పి. దీక్షిత, కె. దీప్తి ప్రియ పాల్గొన్నారు.



# గణిత పరీక్షలో సత్తా చాటిన పాలకూరి అభినయ శ్రీ



చిట్యాల సెప్టెంబర్ 13
(జనం సాక్షి)
సదిష ఫౌండేషన్ నిర్వహించిన సదిష మ్యాస్ టాలెంట్ టెస్ట్ లో చిట్యాల మండలం నేరడ గ్రామం లోని జడ్పీ హైస్కూల్ కు చెందిన పాలకూరి అభినయశ్రీ సత్తా చాటి కార్పొరేట్ కాలేజీల్లో రెండేళ్ల ఉచిత ఇంటర్మీడియట్ విద్యాభ్యాసానికి ఎంపిక కావడం జరిగింది. తెలంగాణలోని సెంటర్లు, మహారాష్ట్రలోని నాందేడు, అలాగే ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు సెంటర్లలో టెస్ట్ నిర్వహించి 70 మందిని సెలెక్ట్ చేసుకోవడం జరిగింది. ఈ టెస్ట్ లో నేరడ విద్యార్థిని సత్తా చటడం పట్ల పాఠశాల హెచ్.ఎం జి. రామ్మోహన్, గణిత ఉపాధ్యాయులు దాసరి శ్రీరాములు, ఉపాధ్యాయ బృందం అభినయశ్రీ నీ అభినందించారు.

# మౌలిక వసతులపై ప్రణాళిక రూపొందించాలి

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



ముందున్న శిథిలావస్థలో ఉన్నప్రహరీని పూర్తిగా తీసేసి కొత్త ప్రహరీ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు.వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని పట్టణంలో ప్రతిరోజు ప్రతి ఒక్కరికి వంద లీటర్ల తాగునీటిని అందించే విధంగా ప్రణాళిక రూపొందించాలని, ఇదివరకే పట్టణంలో పాత వాటర్ ట్యాంకులు16 ఉండగా ,అమృథ్ లో మరో10 కొత్త ట్యాంకుల నిర్మాణం చేపట్టడం జరిగిందని,ఇందుకు తగ్గట్టుగా స్టోరేజ్ కెపాసిటీ పెంచి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే హాలియా మున్సిపాలిటీకి సంబంధించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తో పాటు,అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు నాగర్జున సాగర్ శాసనసభ్యులు కుందూరు జై వీర్ రెడ్డి ని సంప్రదించి డిపిఆర్ ను రూపొందించాలని మంత్రి ఆదేశించారు. మిర్యాలగూడ శాసనస సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి,నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి,జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,నల్గొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,వైస్ చైర్మన్ ఆబ్బగోని రమేష్ గౌడ్, నల్గొండ ఆర్డిఓ అశోక్ రెడ్డి,పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు,మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్ తదితరులు ఈ సమీక్షా సమావేశానికి హాజరయ్యారు.

# సంస్థాగతంగా సభ్యత్వాల ద్వారా బలపడుతున్న బిజెపి

## బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని



పెన్ పహాడ్ నవంబర్ 13 (జనం సాక్షి) :
భారతీయ జనతా పార్టీ సంస్థాగతంగా సభ్యత్వాలలో మరింతగా బలపడుతుందని రానున్న రోజుల్లో జరిగే ప్రతి ఎన్నికల్లో పార్టీ విజయదుందుభి మ్రోగిస్తుందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సంస్థాగత ఎన్నికల సమావేశం, మండల స్థాయి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ సెప్టెంబర్ 2న ప్రారంభమైన సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈనెల 15వ తేదీ వరకు పూర్తవుతుందని 15 తేదీ నుండి 20వ తేదీ వరకు క్రియాశీలక సభ్యత్వాలు ఇవ్వడం జరుగుతుందని అనంతరం 20వ తేదీ నుండి 25వ తేదీ వరకు బూతు కమిటీలు, మండల కమిటీలు, మోర్చా కమిటీలు, జిల్లా కమిటీల ఎంపిక నిర్వహిస్తామని తెలిపారు. ప్రపంచంలో నీ అతి పెద్ద పార్టీ బిజెపి అని దీనిలో తీసుకున్న సభ్యత్వం 6 సంవత్సరముల వరకు అమలులో ఉంటుందని తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు కోటి 50 లక్షల సభ్యత్వాలు పూర్తి అయినయని తెలిపారు. ఇంత నిక్కచ్చి సభ్యత్వం ఇప్పటివరకు ఏ పార్టీ నిర్వహించలేదని రాష్ట్రంలో పెద్ద ఎత్తున సభ్యత్వం తీసుకోవడానికి నరేంద్ర మోడీని బలపరచడానికి ప్రజలు స్వతంత్రంగా ముందుకు వస్తున్నారని అన్నారు. ఇప్పటివరకు సూర్యాపేట నియోజకవర్గ వ్యాప్తంగా 25 వేల 339 సభ్యత్వాలు నమోదయాయని ఇంకా సభ్యత్వం నడుస్తుందని ఇవన్నీ కూడా స్మార్ట్ ఫోన్ ద్వారా తీసుకున్న సభ్యత్వాలేనని తెలిపారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ పథకాలను సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా అవినీతికి పాల్పడడం తోనే అధికారానికి దూరమైందని ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కూడా అదేదోవలో నడుస్తుందని ఎద్దేవ చేశారు. కాంగ్రెస్ పార్టీ అవినీతిలో పుట్టి అబద్దాలతో పెరిగిన పార్టీ అని అన్నారు. 10 సంవత్సరాల్లో కేసీఆర్ మీద వచ్చిన వ్యతిరేకత కంటే ఏడాది గడవక ముందే కాంగ్రెస్ పార్టీపై వచ్చిన వ్యతిరేకత ఎక్కువగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మండల ఇన్చార్జి సలిగంటి వీరేంద్ర, కర్నాటి కిషన్, చలమల్ల నరసింహ, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు నెమ్మాది నరేష్, మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అబీద్, మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కేసరి శోభ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పోకల రాములు, మండల ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి మధు, స్థానిక నాయకులు తూముల సాయి ప్రసాద్, రామ్ రెడ్డి, విజయ్ కుమార్ శ్రీనివాస్ రెడ్డి, వినోద్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు...



# ఓం శ్రీ స్వామియే శరణం అయ్యప్ప

హుజూర్ నగర్ రూరల్, నవంబర్ 13 (జనంసాక్షి): మండలంలోని బూరుగడ్డ గ్రామంలో గల శ్రీ పార్వతి శంభు లింగేశ్వర స్వామి దేవస్థానం నందు యరగాని రామస్వామి గౌడ్ గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి కార్యక్రమం శరణు ఘోషతో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో చిరుమామిళ్ల పుల్లారావు గురుస్వామి, యరగాని గురవయ్య గురుస్వామి, ఆకుల గురువయ్య స్వామి, గుర్రం వెంకన్న స్వామి, గువ్వల వీరయ్య స్వామి, సురభి సైదులు స్వామి, పొదిల వెంకన్న స్వామి, భగవయ్య స్వామి, ప్రవీణ్ స్వామి, నవీన్ స్వామి, అయ్యప్ప స్వాములు, నరసింహ స్వాములు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# గ్రూప్-3 పరీక్షలను ప్రశాంతంగా పకడ్బందీగా నిర్వహించాలి

**సూర్యాపేట జిల్లాలో 50 పరీక్ష కేంద్రాల ఏర్పాటు**

**సూర్యాపేటలో 30.. కోదాడలో 20 పరీక్ష కేంద్రాలు**

**పరీక్షకు హాజరు కానున్న 16543 అభ్యర్థులు**

**అభ్యర్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి**

**అభ్యర్థులు హాల్ టికెట్ ఒరిజినల్ ఐడీతో పరీక్ష కేంద్రంకు రావాలి**

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):
టీజీపీఎస్సీ గ్రూప్ -3 పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవార్ అధికారులకు సూచించారు. బుధవారం టిజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్షల నిర్వహణపై రీజినల్ కోఆర్డినేటర్స్,స్ట్రాంగ్ రూమ్, జాయింట్ కస్టోడియన్స్, పోలీస్ నోడల్ ఆఫీసర్స్, చీఫ్ సూపరింటెండెంట్స్, డిఓ, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, జాయింట్ రూట్ ఆఫీసర్స్ తో ట్రైనింగ్ కమ్ కో ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం12.30గంటల వరకు పేపర్ 1 జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్ పరీక్ష ఉంటుందన్నారు.ఉదయం పరీక్షా కేంద్రం గేట్లు ఉదయం 9.30 గంటలకు మూసివేస్తారని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్ -2 హిస్టరీ, పోలటి అండ్ సొసైటీ పరీక్ష,పరీక్ష కేంద్రం గేట్లు మధ్యాహ్నం 2.30 గంటలకు మూసివేస్తారని పేర్కొన్నారు.18న ఉదయం 10 గంటలనుండి
మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-3 ఎకానమీ అండ్ డెవలప్మెంట్ పరీక్ష, పరీక్షా కేంద్రం గేట్లు ఉదయం 9.30 గంటలకు మూసివేస్తారని తెలిపారు.టిజిపిఎస్సి గ్రూప్ -3 పరీక్షలు సజవుగా,ప్రశాంతంగా జరిగేలా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని సూచించారు.అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 8.30 గంటల వరకు చేరుకోవాలన్నారు.నిర్దేశించిన సమయం తర్వాత అభ్యర్థులెవరిని పరీక్షా కేంద్రంలోకి అనుమతించబడరని తెలిపారు.సూర్యాపేట జిల్లాలో 16543 మంది అభ్యర్థులు టీజీపీఎస్సీ గ్రూప్ 3 పరీక్ష రాస్తున్నారని, వీరి కోసం 50 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.అభ్యర్థులు బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్నులు, హాల్ టికెట్ పై లేటెస్ట్ పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా చెల్లుబాటు అయ్యే ఒరిజినల్ ఫోటో ఐడి కార్డ్ని మాత్రమే పరీక్ష హాల్లోకి తీసుకెళ్లాలన్నారు.సెల్ ఫోన్, చేతి గడియారాలు, క్యాలిక్యులేటర్ తో పాటు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు.ట్రాఫిక్ దృష్టిలో ఉంచుకొని అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకోవాలన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.అభ్యర్థులు టీజీపీఎస్సీ సూచనలు పాటించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలన్నారు. పరీక్ష జరిగేటప్పుడు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని, పరీక్ష ఎంట్రెన్స్ గేట్,పరీక్ష కేంద్రాలలో టేబుల్స్, చైర్స్ సానిటైజ్ చేయాలని, పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ జామ్ కాకుండా చూడాలన్నారు.పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఏఎన్ఎం, మందులను అందుబాటులో ఉంచాలన్నారు.ఈ సమావేశంలో ఎస్పీ సన్ ప్రీత్ సింగ్, అదనపు కలెక్టర్ పి.రాంబాబు, ఏఎస్పీ నాగేశ్వర రావు, జాయింట్ కస్టోడియన్, చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్ట్మెంటల్ అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్స్ తదితరులు పాల్గొన్నారు.

